నవతెలంగాణ
మెదక్
1
ఆదివారం | 20 అక్టోబర్ 2024 | www.navatelangana.com

# కదం తొక్కిన ఎర్రసేన




- దప్పుల దర్వులు...ఆటాపాటలు
- ఎరుపెక్కిన పోరాటాల గడ్డ జహీరాబాద్

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

సంగారెడ్డి సీపీఐఎం జిల్లా మహాసభలు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో శనివారం జహీరాబాద్‌లో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వేలాది మంది సీపీఐఎం శ్రేణులు తరలివచ్చారు. మహాసభల ప్రారంభం సందర్భంగా పట్టణంలోని గంజి నుంచి షేట్కర్ పంక్షన్ హాల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. పార్టీ నాయకులు, అభిమానులు ఎర్రజెండాలు చేతబూని, రెడ్ షర్ట్ ధరించి ప్రదర్శనగా సాగారు. పట్టణ వీధుల్లో ఎర్రసేన కదం తొక్కింది. జహీరాబాద్ పట్టణమంతా ఎరుపెక్కింది. నిమ్జ్ భూ పోరాటం, కనీస వేతనాల పోరాటాలు సాగించిన సీపీఎం మహాసభలకు వేలాది మంది రైతులు, కూలీలు, కార్మికులు, మహిళలు తరలివచ్చారు. నిమ్జ్ నిర్వాసితులంతా తమ కోసం కొట్లాడి న్యాయం చేకూర్చిన ఎర్రజెండాను గుండెల్లో అత్తుకుని ప్రదర్శనలో పాల్గొన్నారు. స్వంతంగా వాహనాలు సమకూర్చుకుని సద్దిబువ్వ కట్టుకుని నిమ్జ్ భూ నిర్వాసితులు ర్యాలీ, సభలో పాల్గొన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య, చుక్కరాములు, రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లిఖార్జున్, ఆముదాల మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శులు మల్లేశం, జయరాజు, పార్టీ నాయకత్వం ప్రదర్శన ముందు భాగాన నడిచారు. పీఎస్ఎం కళాకారులు డప్పుల దర్వులు, ఆటాపాటలతో అలరింపచేశారు.

# ఉత్సాహభరితంగా...
# సీపీఐఎం మహాసభలు ప్రారంభం









- భారీ ర్యాలీగా కదం తొక్కిన ఎర్ర సైన్యం
- ఎర్రజెండాల రెపరెపలతో ఎరుపెక్కిన పోరాటాల గడ్డ
- కార్యదర్శి నివేదికపై ప్రతినిధుల చర్చలు
- రాబోయే కాలంలో ప్రజా సమస్యలపై సమరశీల ఉద్యమాలు
- సీపీఐఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, చుక్క రాములు
- పార్టీ జెండాను ఎగురవేసిన సీనియర్ నాయకులు వాజీద్ అలీ

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

సీపీఐఎం సంగారెడ్డి జిల్లా 3వ మహాసభలు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో శనివారం జహీరాబాద్ పట్టణంలోని (ప్రకాశ్‌నగర్) షేట్కర్ పంక్షన్ హాల్‌లో ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే మహాసభల సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ, సభ నిర్వహించారు. ఎర్ర జెండాల రెపరెపలతో పోరాటాల గడ్డ జహీరాబాద్ ఎరుపెక్కింది. వేలాది మంది సీపీఐఎం శ్రేణులు ఎర్రజెండాలు చేతబూని, రెడ్ షర్ట్ ధరించి కేరింతలతో ర్యాలీలో కదం తొక్కారు. దప్పుల దర్వులు...ఆటా పాటలతో పీఎస్ఎం కళాకారులు అలరింపచేశారు. గంజి నుంచి షేట్కర్ పంక్షన్ హాల్ వరకు భారీగా సాగిన ప్రదర్శనకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య, చుక్క రాములు, పార్టీ జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, ఇతర నాయకులు ముందు నడిచారు. నిమ్జ్ నిర్వాసిత బాధితులు ఎర్రజెండాను గుండెలకత్తుకుని ర్యాలీలో నడిచారు. తమ న్యాయమైన సమస్య పరిష్కారం కోసం సీపీఐఎం నికరంగా నిలబడి పోరాడిందంటూ ఆ నాటి పోరాటాల్ని గుర్తు చేసుకుంటూ ప్రదర్శనగా సాగారు. కళాకారులు, నిమ్జ్ బాధిత గ్రామాల ప్రజలు దప్పుల దర్వేస్తూ... కేరింతలు కొడుతూ ర్యాలీలో పాల్గొన్నారు. రైతులు, కూలీలు, పేదలు, కార్మికులు ఎర్రజెండాలు చేతబట్టి 'పోరాడితే పోయేదేమిలేదు బానిస సంకెళ్లు తప్ప' అంటూ నినదించారు.

### పార్టీ జెండాను ఎగురవేసిన వాజీద్ అలీ

పార్టీ జిల్లా మహాసభల సందర్భంగా జెండాను ఆ పార్టీ సీనియర్ నాయకులు వాజీద్ అలీ ఎగురవేశారు. మహాసభలకు హాజరైన ప్రతినిధులు, పార్టీ



శ్రేణులు పార్టీ జెండావిష్కరణ కార్యక్రమంలో క్రమశిక్షణగా పాల్గొన్నారు. ప్రజా పోరాటాల్లో ప్రాణాలర్పించిన అమరు వీరుల స్తూపం వద్ద పార్టీ నాయకులు ఘనంగా నివాళ్లు అర్పించారు. ఎస్.వీరయ్య, చుక్క రాములు, ఆముదాల మల్లారెడ్డి, మల్లిఖార్జున్, ఎ.మల్లేశం, జయరాజు, బి.మల్లేశం, బి. రామచంద్రం, కె.రాజయ్య అతిమేల మాణిక్, జి.సాయిలుతో పాటు పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, ప్రతినిధులు అమరులకు నివాళ్లు అర్పించారు. పీఎస్ఎం కళాకారులు అమరుల్ని తలుస్తూ 'ఓ అమరులారా త్యాగధనులారా అంటూ గీతాలాపన చేశారు. వేదికపైన సీపీఐఎం జాతీయ కార్యదర్శిగా పనిచేసి ఇటీవల మరణించిన సీతారాం ఏచూరి, జహీరాబాద్ ఏరియా కమిటీ సభ్యులు ప్రకాశ్ చిత్రపటాలకు నాయకులు పూల మాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం జరిగిన ప్రారంభ సభకు పార్టీ ఏరియా కార్యదర్శి బి.రామచంద్రం అధ్యక్షత వహించారు. పార్టీ జిల్లా మహాసభలకు సంగారెడ్డి పట్టణానికి చెందిన మద్దూరు లక్ష్మి, మద్దూరు బాలరాజ్, మద్దూరు శివకుమార్ ముగ్గురు ఒకే కుటుంబం నుంచి ప్రతినిధులుగా హాజరవ్వడం విశేషం.



### ప్రజా సమస్యలపై సమరశీల ఉద్యమాలు: వ్యక్తలు

జహీరాబాద్‌లో జరిగుతున్న పార్టీ మహాసభల స్ఫూర్తితో రాబోయే కాలంలో ప్రజల సమస్యలపై మరింత సమరశీలంగా ఉద్యమాలు చేపట్టనున్నట్లు సీపీఐఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు ఎస్.వీరయ్య, చుక్క రాములు, రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లిఖార్జున్, సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లా కార్యదర్శులు ఆముదాల మల్లారెడ్డి, ఎ.మల్లేశం, గొల్లపల్లి జయరాజ్ ఇతర నాయకులు పిలుపు నిచ్చారు. ప్రారంభ సభలో పాల్గొని వారు మాట్లాడారు. గత ప్రభుత్వం రైతుల్ని భయపెట్టి సాగు భూముల్ని లాక్కొని వేలాది కుటుంబాల్ని రోడ్డున పడేసిందన్నారు. అప్పుడు గగ్గోలు పెట్టిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వం మాదిరే భూముల్ని బలవంతంగా లాక్కొని కంపెనీలకు కట్టబెట్టాలని చూస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గురుకులాలకు అద్దెలు చెల్లించలేని దుస్థితి ఉందన్నారు. కనీసం గ్రూప్స్ పరీక్షల్ని కూడా సక్రమంగా నిర్వహించకపోవడం బాదాకరమన్నారు. రైతులకు బంధు, భరోసా లేకుండా పోయిందన్నారు. రుణమాఫీ సగమే చేసి చేతులు దులుపుకోవడంతో అన్నధాతలు ఆందోళన చెందుతున్నారన్నారు. మహిళలకు ఇస్తామన్న రూ.2500 ఇవ్వకపోతే గ్రామాల్లో తిరిగనివ్వొద్దన్నారు. నిమ్జ్ బాధితులకు పునరావాసం ఏర్పాటు చేసే వరకు పోరాటం చేయాలన్నారు. కార్మికుల కనీస వేతనాలు, సదుపాయాల కోసం ఎర్రజెండా కోట్లాడుతుందన్నారు.

### ప్రతినిధుల సభ...కార్యదర్శి నివేదికపై చర్యలు

ప్రారంభ సభ తర్వాత ప్రతినిధుల మహాసభలు మొదలయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేయబడిన ప్రతినిధులు, పరిశీలకులు మహాసభల్లో పాల్గొన్నారు.ముందుగా సంతాప తీర్మాణాన్ని ఏ.మాణిక్యం ప్రవేశ పెట్టారు. పార్టీ ప్రతినిధుల సభలకు అధ్యక్ష వర్గంగా బి.మల్లేశం, అతిమేల మాణిక్యం, ఎస్.లలిత వ్యవహారించగా తీర్మానాల కమిటీ సభ్యులుగా కె.రాజయ్య, వి.ప్రవీణ్, బాల్‌రెడ్డి, ఎస్.మహిపాల్, మినిట్స్ కమిటీ సభ్యులుగా జి.సాయిలు, ఎం.రేవంత్‌కుమార్, బి.నాగేశ్వర్‌రావు, అశోక్, అభినవ్, అర్హతల కమిటీ సభ్యులుగా ఎం.నర్సింహులు, ఎం.యాదగిరి, బి.విద్యాసాగర్, బి.యాదవరెడ్డి, ఎస్.రమేష్, స్టీరింగ్ కమిటీ సభ్యులుగా పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వ్యవహారించారు. గత మహాసభ నుంచి మూడేళ్ల కాలంలో నిర్వహించిన పోరాటాలు, ఉద్యమ కార్యక్రమాలు, నిర్మాణానికి సంబంధించిన నివేదికను కార్యదర్శి జయరాజు ప్రవేశ పెట్టారు. ప్రతినిధులంతా ఏరియా వారిగా రంగాల వారిగా నివేదికపై చర్చించారు. ఆదివారం మహాసభలో పలు తీర్మానాలు ప్రవేశపెట్టానున్నారు. ముఖ్యంగా భూ నిర్వాసితులు, కార్మికులు, మహిళలు, నిరుద్యోగులు, విద్యార్థులు, వృత్తిదారులు, దళితులు, మైనార్టీలు, గిరిజనులకు సంబంధించిన పలు సమస్యలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పలు తీర్మానాలను మహాసభలో ప్రవేశపెట్టి చర్చించి ఆమోదం తెలపనున్నారు. నూతన జిల్లా కమిటీ ఎన్నికతో మహాసభలు ముగుస్తాయి.

## ప్రమాదానికి గురైన కారులో 90 కేజీల గంజాయి

కారును చెట్టుకు ఢీ కొట్టి, పారిపోయిన గుర్తు తెలియని వ్యక్తులు




నవతెలంగాణ-రామాయంపేట

ప్రమాదానికి గురైన కారులో పెద్ద ఎత్తున గంజాయి లభ్యమయింది. రామాయంపేట బైపాస్ రోడ్డులో గుర్తు తెలియని వ్యక్తులు, హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు షిఫ్ట్ డిజైర్ ఏపీ 26 ఏజీ 8181 నెంబర్ గల కారులో అతి వేగంగా వచ్చి చెట్టుకు ఢీకొట్టడంతో బోల్తా పడింది. దీంతో కారులో ఉన్న దుండగులు పరారయ్యారు. రోడ్డు ప్రమాదానికి గురైన కారును పెట్రోలింగ్‌లో ఉన్న పోలీసులు గమనించి పరిశీలించగా, కారులో 32 ప్యాకెట్లలో 90 కేజీల ఎండు గంజాయి లభ్యమైంది. ఘటన స్థలానికి చేరుకున్న రామాయంపేట ఎస్సై బాలరాజు ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు.

## విద్యార్థులకు చేతివ్రాత పుస్తకాలు పంపిణీ



నవతెలంగాణ-రాయపోల్

విద్యార్థులకు చేతి వ్రాత మెరుగుపరచడానికి చేతి వ్రాత పుస్తకాలు పంపిణీ చేయడం జరిగిందని చేసిన ముంగిస్ పల్లి ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్ కుమార్ అన్నారు. శనివారం రాయపోల్ మండలం ముంగిస్ పల్లి ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు చేతి వ్రాత పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి పౌరులని, అలాంటి విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ఉపాధ్యాయులు తల్లిదండ్రులు కలిసికట్టుగా కృషి చేయాలన్నారు.సొంత ఖర్చుతో విద్యార్థులకు చేతి వ్రాత పుస్తకాలను పంపిణీ చేయడం జరిగిందని, విద్యార్థుల చేతి వ్రాత బాగుంటేనే పరీక్షలలో మంచి మార్కులు సాధిస్తారన్నారు. అనంతరం బదిలీపై పాఠశాలకు నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులు ప్రవీణ్ కుమార్‌ను తల్లిదండ్రులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ప్రభాకర్, స్వామి, రామస్వామి, రమేష్, స్వరూప, లక్ష్మి, స్వామి, కృష్ణ, లక్ష్మయ్య పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి అర్థికసాయం

నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని నర్సన్నపేట గ్రామానికి చెందిన యెంబరి బాలనర్సయ్య. (46) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. శనివారం డైమండ్ లారీ డ్రైవర్ యూనియన్ , సిఐటియు ఆధ్వర్యంలో బాధిత కుంటుంబానికి రూ. 30 వేలు,100 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు, తదితరులున్నారు.



## బాలల హక్కులు, పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-మునిపల్లి

మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్‌స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాలల హక్కులు, సంరక్షణ, పీఓపీఎస్‌ఓ చట్టం 2012లాంటి పలు విషయాలపై శనివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు విష్ణుమూర్తి, జిల్లా బాలల సంరక్షణ అధికారి రత్నం, భరోసా కోఆర్డినేటర్ దేవలక్ష్మిలు పాల్గొని మాట్లాడుతూ.. పాఠశాల విద్యార్థులు కౌమార దశలో జరుగుతున్న శారీరక మార్పులను గ్రహించి తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే కొత్తవారికి, తెలియని వారికి తమ మొబైల్ నెంబర్ ఇవ్వొద్దన్నారు. బాలికలు తమకు జరిగే వేధింపులు, దాడుల గురించి వెంటనే తల్లిదండ్రులు లేదా ఉపాధ్యాయులతో చెప్పి పరిష్కారం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా పాఠశాలలు మాదకద్రవ రహితంగా ఉండాలని, చిన్నతనంలో ప్రలోభాలకు లోనవ్వకుండా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ భీమ్‌సింగ్, ప్రిన్సిపల్ మల్లిక, ఏఎస్సై యేసయ్య, బాలల సంరక్షణ అధికారి లింగం, సీడీపీఓ చంద్రకళ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## 'సెల్‌మార్'లో అనుమానాస్పదంగా కార్మికుడు మృతి

మృతుని కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలి

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం



గడ్డపోతారం పారిశ్రామికవాడలోని సెల్‌మార్ ల్యాబ్ పరిశ్రమలో బ్రయిన్ ట్యాంక్‌లో పడి పి.రాజేష్‌కుమార్ (31) అనే యువకుడు శనివారం అనుమానాస్పదంగా మృతి చెందారు. భద్రాచలానికి చెందిన రాజేష్ కుమార్ విద్యుత్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నాడు. కాగా ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు బొల్లారం పోలీసులు తెలిపారు.

### ఘటన పట్ల పూర్తి విచారణ జరపాలి
సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు కే.రాజయ్య



సెల్‌మార్ ల్యాబ్‌లో జరిగిన ఈ ఘటన గురించి పూర్తి విచారణ జరిపి మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు కే.రాజయ్య డిమాండ్ చేశారు. మృతుని కుటుంబానికి రూ.50 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికుడు ఎలా చనిపోయాడో కూడా చెప్పలేని స్థితిలో కంపెనీ యజమాన్యం ఉండడం దారుణమన్నారు. యజమాన్య నిర్లక్ష్యంతోనే కార్మికుడు మృతి చెందాడని ఆరోపించారు. మృతుని కుటుంబానికి న్యాయం జరగాలని.. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

## డాకూర్ పాఠశాలలో గర్ల్స్ టాయిలెట్ల ప్రారంభం

నవతెలంగాణ-జోగిపేట

అందోల్ మండల పరిధిలోని డాకూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థినుల కోసం ఏపీమెట్ కంపెనీ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన గర్ల్స్ టాయిలెట్లను ఆ కంపెనీ ఫైనాన్స్ డిపార్ట్మెంట్ అధికారి రామకృష్ణ శనివారం ప్రారంభించారు. సిఎస్ఆర్ పండ్ కింద రూ.10 లక్షల వ్యయంతో పనులను చేపట్టారు. గ్రామానికి చెందిన జోహార్‌రెడ్డి కంపెనీలో ఉన్నతస్థాయిలో పనిచేస్తున్నారు. ఆయన సూచన మేరకు కంపెనీ యజమానులతో మాట్లాడి తమ గ్రామంలో విద్యార్థినుల కోసం సేవా కార్యక్రమం చేయాల్సిన అవసరం ఉందని తెలపడంతో కంపెనీ వారు ముందుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు జైపాల్ రెడ్డి, అక్సాన్‌పల్లి పీఏసీహెచ్ చైర్మెన్ నరేందర్ రెడ్డి, మండల విద్యాధికారి బండికృష్ణ, డాకూర్ మాజీ ఎంపీటీసీ కలాలి రమేష్ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ అజయ్, వార్డు మాజీ సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మెన్ గంగ, గ్రామ నాయకులు , మల్లేశం, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.




# హామీలు విస్మరిస్తే ..
# పోరాటాలు తప్పవు

- బీజేపీ, బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్
- పాలకుల పట్ల పెరుగుతున్న అసంతృప్తి
- మహాసభల స్ఫూర్తితో బలమైన ప్రజా ఉద్యమాలు:చుక్క రాములు

నవతెలంగాణ-జహీరాబాద్

అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం బీజేపీ, బీఆర్ఎస్ బాటలోనే నడుస్తుందని సీపీఐఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు విమర్శించారు. శనివారం జహీరాబాద్‌లో ప్రారంభమైన సీపీఐఎం జిల్లా మహాసభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా ఇచ్చిన ఆరు గ్యారంటీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ప్రతి మహిళకు రూ.2500లు ఇస్తామని చెప్పిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి మహిళకు బ్యాంకు ఖాతాలో రూ.2500లు వేసిన తర్వాతనే కాంగ్రెస్ మంత్రులు, నాయకులు గ్రామాల్లో తిరగాలని, లేదంటే ప్రజలు వాళ్లను అడ్డుకోవాలని పిలుపు నిచ్చారు. మహిళల పక్షాన పోరాటాలు చేసేందుకు సీపీఐఎం సిద్ధంగా ఉందన్నారు. రైతుబంధు డబ్బులతో రుణమాఫీ చేశారే తప్ప ముఖ్యమంత్రి రైతులకు చేసింది ఏమీ లేదన్నారు. గతంలో ఉన్నటువంటి సౌకర్యాలను కూడా తొలగించారని అన్నారు. ముఖ్యమంత్రి అరచేయిలో బెల్లం పెట్టి మోచేయితో నాకమంటున్నాడని ఇది మంచి పద్ధతి కాదని హితువు పలికారు. దౌర్జన్యాలకు, దాడులకు వ్యతిరేకంగా తమ పార్టీ అన్ని వర్గాల వారికి అండగా ఉంటుందన్నారు. గ్రామపంచాయతీ కార్మికుల నుండి వివిధ ప్రభుత్వ రంగ శాఖలో విధులు నిర్వహించే కార్మికులకు తమ పార్టీ అండంగా నిలుస్తుందన్నారు. ఎర్ర జెండా అధికారంలో ఉన్నటువంటి పరిశ్రమల్లో యజమాన్యాలతో పోరాడి కార్మికులకు, కాంట్రాక్టు కార్మికులకు మెరుగైన వేతనాన్ని ఇప్పిస్తున్న ఘనత ఎర్రజెండాకే దక్కుతుందన్నారు. పరిశ్రమల్లోనే కాదు వివిధ ప్రభుత్వ రంగాల్లో పనిచేసే కార్మికులు సైతం పార్టీలు, కులమతాలకు అతీతంగా వచ్చి కేవలం ఎర్రజెండాతోనే తమ సమస్యలు పరిష్కారం అవుతాయని భావిస్తున్నారన్నారు. సౌకర్యాలతో పాటు సమస్యలు కూడా పెరిగాయి ఐక్యరాజ్యసమితి వారు ప్రపంచవ్యాప్తంగా సర్వే నిర్వహించి 110 కోట్ల జనాలు ఆకలితో అల్లాడుతున్నారని నిర్ధారించారని తెలిపారు అందులో 24 కోట్ల ప్రజలు భారతదేశానికి చెందినటువంటి వారు ఉండడం బాధాకరమైన విషయమని అన్నారు. రానున్న రోజుల్లో ఎర్రజెండాల రాజ్యం రావాలని, అందుకోసం కార్యకర్తలు అందరూ సైనికుల్లా కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశ ప్రధాని మోడీ అబద్ధాలను అల్లడంలో ఆయనకు ఏ అవార్డు ఇచ్చిన చెల్లుతుందని అన్నారు. నల్ల డబ్బులు తీసుకొస్తానని, ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షల వేస్తానని అన్నాడు, కేవలం ఆదానీ అంబానీల ఆస్తులు పెంచేందుకు మాత్రమే మోడీ పని చేస్తున్నారన్నారు. దేవునిపేర వర్గ విభజన చేసి దాడులు జరిపి ప్రజలకు భయభ్రాంతులకు గురిచేసి ఓట్లు రాబట్టి గద్దె పైకి ఎక్కితే అది నిజమైన విజయం కాదన్నారు.కార్మికుల హక్కులను కాలరాసే విధంగా కార్మిక వ్యతిరేక నల్ల చట్టాలను తీసుకువచ్చారన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఆ చట్టాలను అమలు చేయడంతో అక్కడ ఎనిమిది గంటలు పనిచేసే కార్మికులు 12 గంటల విధులు నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. కేసీఆర్ బంగారు తెలంగాణ అని, బంగారు కుటుంబంగానే మార్చుకున్నారు తప్ప తెలంగాణను అన్ని విధాల నష్టం చేకూర్చారన్నారు. ఇది మంచి పరిణామం కాదని, అందుచేతనే అన్ని వర్గాల వారికి ఆయన అరచేతిలో వైకుంఠం చూపించినందువల్లే ప్రజలు కూడా ఆయనకు కర్ర కాశి వాత పెట్టారన్నారు.






## నూతన ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్‌పై అవగాహన

నవతెలంగాణ-రాయపోల్

'ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ-నూతన ఉపాధ్యాయుల పాత్ర' అనే అంశంపై మరియు సర్వీస్ రూల్స్ పై డీఎస్సీ-2024 నూతన ఉపాధ్యాయులకు టీఎస్‌యూటీఎఫ్ సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు నిర్వహించనున్నట్లు టీఎస్‌యూటీఎఫ్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి అన్నారు. రాయపోల్ మండలంలోని వివిధ పాఠశాలలో నూతన ఉపాధ్యాయులకు సమాచారం అందిస్తూ శనివారం కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీఎస్సీ 2024 ద్వారా సిద్దిపేట జిల్లాలో నియామకమైన 256 మంది ఉపాధ్యాయులకు సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఉదయం 10:00 గంటలకు అవగాహనా సదస్సు ఉంటుందన్నారు. మండలంలోని రాయపోల్,తిమ్మక్ పల్లి, ఆరెపల్లి, రాంసాగర్, వడ్డేపల్లి, వీరానగర్, వీరారెడ్డిపల్లి వివిధ పాఠశాలల్లోని నూతన ఉపాధ్యాయులను కలిసి అవగాహన సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా విద్యాధికారి శ్రీనివాసరెడ్డి, ప్రధాన వక్తగా సర్వీస్ రూల్స్ పైన సమగ్రమైన అవగాహన కలిగిన టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏ .వెంకట్ హాజరవుతారన్నారు. కావున జిల్లాలో నూతనంగా నియామకమైన ఉపాధ్యాయులందరూ సదస్సుకు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ టి.శివలింగం, జిల్లా కమిటీ సభ్యులు నూతన ఉపాధ్యాయులు శ్రీకాంత్, నవీన్, లావణ్య, ప్రశాంత్, వెన్నెల, గోపాల్, రమేష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు......



## వృథాగా మిషన్ భగీరథ నీరు..

నవతెలంగాణ-మునిపల్లి

మండలంలోని కంకోల్ గ్రామంలో గల నేషనల్ హైవే సమీపంలో భారత్ పెట్రోల్ బంక్ పక్కన వారం రోజుల క్రితం మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్ పగిలింది. దాంతో నాటి నుంచి నీరు వృథాగా పోతున్నది. అయినప్పటికీ ఇప్పటివరకు అధికారులు పట్టించుకోలేదు. ఈ లీకేజీ వల్ల పలు గ్రామాలకు నీటి సరఫరా జరగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఈ నీరు రోడ్లపైకి రావడంతో వాహనదారులు, స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి.. వెంటనే పైప్‌లైన్‌కి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



## అల్లాదుర్గంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రారంభం

నవతెలంగాణ-వట్‌పల్లి



అందోల్ నియోజకవర్గంలోని అల్లాదుర్గంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టును హైకోర్టు జడ్జి జస్టిస్ విజయ్ సేన్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. చాలా రోజులుగా ప్రారంభోత్సవం అనివార్య కారణాల వల్ల వాయిదా పడిందని.. ఎట్టకేలకు ప్రారంభం అయిందని సంతోషం వ్యక్తం చేశారు. టేక్మాల్, రేగోడు, పెద్దశంకరంపేట, అల్లాదుర్గంతో పాటు సివిల్ కేసులను ఇప్పటినుండి ఇక్కడికే వస్తాయన్నారు. అంతకుముందు నాలుగు పోలీస్ స్టేషన్లకు సంబంధించిన పోలీసులు ప్రభుత్వ లాంఛన ప్రకారం హైకోర్టు జడ్జి జస్టిస్‌కు వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పోలీస్ స్టేషన్లకు సంబంధించిన ఎస్ఐలు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, మండల అభివృద్ధి కార్యాలయ సిబ్బంది, ట్రాన్స్కో, ఆయా శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-కల్హేర్



నిజాంపేట మండలంలోని రామ్‌రెడ్డిపేట గ్రామానికి చెందిన సిహెచ్ పార్వతికి రూ.24,000, మేఘ్యనాయక్ తాండాకు చెందిన శ్రీయన్న నాయక్‌కు రూ.9,000, నేనావత్ బీమ్ను నాయక్‌కు రూ.18,000 సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారుల ఇంటికి స్వయంగా వెళ్లి మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు వైద్య ఖర్చు భారాన్ని తగ్గించడానికి ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ జెడ్పీటీసీ లక్ష్మిబాయ్ రవీందర్ నాయక్, పార్టీ మండలాధ్యక్షుడు రామ్‌సింగ్, మున్సిపల్ కౌన్సిలర్ ముజామిల్, తాజా మాజీ వైస్ ఎంపీపీ సాయిరెడ్డి, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షులు జగదీశ్వర చారి, తాజా సర్పంచులు ఈశ్వర్, నవాబ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.




## సబ్ స్టేషన్‌కు స్థలం కేటాయించండి

నవతెలంగాణ-రామచంద్రాపురం

రామచంద్రాపురం పరిసరాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్‌కు స్థలం కేటాయించాలని రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప నగేష్ జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డిని కలిసి శనివారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం నుంచి సబ్ స్టేషన్‌కు నిధులు మంజూరు అయినప్పటికీ స్థలం లేకపోవడం మూలంగా వాటి నిర్మాణం చేయలేకపోతున్నామని.. కాబట్టి రామచంద్రాపురం పరిసరాల్లో స్థలాన్ని కేటాయించాలని కార్పొరేటర్ జోనల్ కమిషనర్‌ని కోరారు. అలాగే డివిజన్లో విద్యుత్ దీపాల కొరత పెండింగ్లో ఉన్న సీసీరోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు వెంటనే నిధులు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎడి నాగరాజు, ఏఈ సంజీవ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 22 నుంచి ఇర్ఫాని దర్గా ఉర్సు ఉత్సవాలు



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి పట్టణ శివారులోని హజ్రత్ మౌలానా అల్ హజ్ హబీబ్ అహ్మద్ బిన్ ఒమర్ అల్ మారూఫ్ హబీబ్ ఇర్ఫాన్ అలీ షా బంద నవాజి (ఇర్ఫాని దర్గా) 22వ ఉర్సు ఉత్సవాలు ఈ నెల 22 నుంచి రెండ్రోజులపాటు జరగనున్నాయని పీఠాధిపతి హజ్రత్ హకీమ్ ఒమర్ బిన్ అహ్మద్ సజ్జద్ యే నషీన్ బార్గ ఇర్ఫానీ తెలిపారు. ప్రతీయేడు రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరై మొక్కులు తీర్చుకుంటారన్నారు. మొదటి రోజైన 22వ తేదీ మంగళవారం సంగారెడ్డిలోని జామియా మస్జిద్ నుండి సాయంత్రం 5 గంటలకు గంధం ఊరేగింపు, రాత్రి 8గంటలకు ఇర్ఫాని దర్గాలో గంధారాధన, 9 గంటలకు ఆల్ ఇండియా ముషాయిరా ఉంటుందని అన్నారు. రెండోరోజు 23వ తేదీ బుధవారం సాయంత్రం దీపారాధన, ఖవ్వాలి, అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ ఉత్సవాలకు వివిధ దర్గాల పీఠాధిపతులు హాజరు కానున్నారన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, భక్తులు ఉత్సవాల్లో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఇర్ఫానీ దర్గా పీఠాధిపతి హజ్రత్ హకీమ్ ఒమర్ బిన్ అహ్మద్ సజ్జద్ యే నషీన్ బార్గ ఇర్ఫానీ కోరారు.



## హనుమాన్ మందిర్ నిర్మాణానికి లక్షా 51వేల విరాళం

నవతెలంగాణ-రాయికోడ్

మండల కేంద్రమైన రాయికోడ్‌లో నిర్మిస్తున్న హనుమాన్ ఆలయానికి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ మాలేదొడ్డి ఏసయ్య ఒక్క లక్ష 51 వేలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లౌకిక భారతదేశంలో సర్వమతలను ఆదరించడం అందరి బాధ్యత అన్నారు. భిన్నత్వంలో ఏకత్వానికి ఇది నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో మండల తాజా మాజీ జెడ్పీటీసీ మల్లికార్జున్ పాటిల్, తాజా మాజీ సర్పంచ్ కేదార్నాథ్ పాటిల్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ వినయ్, గ్రామ నాయకులు తుకారం, విట్టల్ రావు కులకర్ణి, శివకుమార్ ,లక్ష్మణ్, సంగమేశ్వర్, రవి తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ గుమ్మడిదల మండలాధ్యక్షులుగా ప్రభాకర్ రెడ్డి



నవతెలంగాణ-గుమ్మడిదల

బీఆర్ఎస్ గుమ్మడిదల మండలా ధ్యక్షులుగా కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డిని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ పదవి గతేడాది నుంచి ఖాళీగా ఉండడంతో పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో సీజీఆర్ ట్రస్ట్ కార్యాలయంలో శనివారం ఎన్నిక నిర్వ హించారు. ఈ సందర్భంగా కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా రాష్ట్ర ఉద్యమకారుడు మల్లేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బి.నరహరిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం ఎన్నికైన నూతన అధ్యక్ష కార్యదర్శులను ఆయా గ్రామాల సర్పంచులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు శాలువాలతో సన్మానించారు.


## వ్యభిచార గృహంపై పోలీసుల దాడులు

నవతెలంగాణ-పటాన్‌చెరు



వ్యభిచార గృహంపై పోలీసులు మెరుపు దాడి చేసి.. ఇద్దరు గృహ నిర్వాహకులను అరెస్టు చేశారు. సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హరినాథపురం నెల్లూరుకు చెందిన పోలంరెడ్డి సాయి కృష్ణారెడ్డి (40), మేకల నాగేశ్వర్ రావు(37)లు మండలంలోని చిట్కుల్ గ్రామానికి గత రెండేండ్ల క్రితం వచ్చారు. వారు కొలకత్తా నుంచి అమ్మాయిలను పిలిపించి అమీన్‌పూర్, చిట్కుల్ ఏరియాల్లో అద్దె ఇల్లు తీసుకొని వ్యభిచార గృహాన్ని నడిపిస్తున్నారు. అయితే 22-07-2023న పోలీస్‌లు దాడి చేయగా సాయి కృష్ణారెడ్డి వెనుక డోర్ నుంచి పారిపోయాడు. ఆ సమయంలో అమ్మాయిని కోర్ట్ ముందు హాజరు పరచి కోర్ట్ ఉత్తర్వు మేరకు రిహాబిలిటేషన్ సెంటర్ హైదరాబాద్‌లో అడ్మిషన్ చేశారు. కాగా అతడు మరల చిట్కుల్ గ్రామములో వ్యభిచార గృహము నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు.. డీఎస్పీ రవీందర్ రెడ్డి ఆదేశాలతో శనివారం వ్యభిచారం నిర్వహిస్తున్న గృహంపై పోలీసులు దాడులు చేశారు. వెస్ట్ బెంగాల్ కు చెందిన ఒక యువతి(30) వ్యభిచార గృహ నిర్వాహకులు పోలంరెడ్డి సాయి కృష్ణారెడ్డి, మేకల నాగేశ్వర్ రావులను అదుపులోకి తీసుకొని విచారించగా ఒప్పుకున్నారు. ఇద్దరి నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మహిళలను జిల్లా మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. సాయి కృష్ణారెడ్డి మీద గతంలో అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో రెండు కేసులు, పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో ఒక కేసు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. కేసును చేధించిన సీఐ ప్రవీణ్ రెడ్డి, సిబ్బందిని డీఎస్పీ రవీందర్‌రెడ్డి అభినందించారు.

## ఖలీల్‌పూర్‌లో కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపన



నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని ఖలీల్‌పూర్‌లో గ్రామదేవతల విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ముంగి ఆదిలక్ష్మి, ఆశ్రమ దేవగిరి మహారాజు, స్థానికుల ఆధ్వర్యంలో పూజలు ఘనంగా సాగుతున్నాయి. ఊరడమ్మ, లక్ష్మీదేవి, భూల క్ష్మి, పోచమ్మ, కేశమ్మ విగ్రహా ప్రతిష్టాపన, అలంకరణ, ధ్వజస్తంభ ప్రతిష్టాపన జరిగాయి. నేడు(ఆదివారం) జరిగే ఈ పూజా కార్యక్రమాలకు ఎంపీ సురేష్ శెట్కర్, ఎమ్మెల్యే మాణిక్‌రావు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు రానున్నట్టు గ్రామ ప్రజలు పేర్కొన్నారు.

# మతోన్మాద రాజకీయాల్ని తిప్పికొట్టాలి

నవతెలంగాణ-జహీరాబాద్

కేంద్ర బీజేపీ సర్కార్ మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ రాజకీయ పబ్బం గడుపుతున్నదని ఈ కుట్రలను ప్రతీ ఒక్కరూ తిప్పికొట్టాలని సీపీఐ(ఎం) జిల్లా మహాసభల్లో పలువురు వక్తలు పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్నదన్నారు. ఈ ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ(ఎం) నిరంతరం పోరాడుతూనే ఉన్నదన్నారు. ప్రజలకు కూడా బీజేపీ మతోన్మాద చర్యలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

**ఆడిపాడిన పిఎన్ఎం కళాకారులు**

సీపీఐఎం సంగారెడ్డి జిల్లా మహాసభల సందర్భంగా నిర్వహించిన ర్యాలీ, సభలో ప్రజానాట్య మండలి కళాకారులు ఆడి పాడారు. డప్పుల దర్వులతో ఆడుతూ పాడుతూ ప్రదర్శన ముందు నడిచారు. అమరవీరుల స్థూపం వద్ద నివాళ్లు అర్పిస్తూ జోహార్లు అంటూ గీతాలాపన చేశారు. జహీరాబాద్ పట్టణంలోని సీపీఐఎం కార్యాలయం నుండి మొదలుకొని సుభాష్ గంజ్ సెంటర్ మీదుగా జాతీయ రహదారి 65 వెంట సభా వేదిక వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పిఎన్ఎం కళాకారులు నాగభూషణం, మాదినం అంజయ్య బందాలు నిర్వహించిన కళా ప్రదర్శన అందర్నీ ఆకట్టుకుంది. జిల్లా మహాసభల్లో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.మల్లేశం,కె.రాజయ్య, అతిమేల మాణిక్యం, రామచంద్రం, జి.సాయిలు, జిల్లా నాయకులు డాక్టర్ శివ బాబు, మహిపాల్, రాజిరెడ్డి, లక్ష్మి , బాగారెడ్డి, పాండురంగారెడ్డి, నర్సింహులు, విద్యాసాగర్, ప్రవీణ్, యాదగిరి, యాదవరెడ్డి, నర్సింహ్మారెడ్డి, రేవంత్‌కుమార్, రాజయ్య, రమేష్, అశోక్, అంజయ్య పాల్గొన్నారు.

### సంగారెడ్డి జిల్లా ఉద్యమాల గడ్డ..



గతంలో నల్గొండ, ఖమ్మం జిల్లాలోనే సమస్యలపై పోరాటాలు నిరంతరంగా జరిగేవి.. సంగారెడ్డి జిల్లా సైతం నిరంతర ప్రజా పోరాటాలు, ఉద్యమాలకు గడ్డగా మారింది. ఎక్కడైతే పోరాటాలు జరుగుతాయో అక్కడే సమస్యలు పరిష్కారం అవుతాయి. రెండేండ్లకొకసారి పెరగాల్సిన కనీస వేతనాలు 17 ఏళ్లుగా పెరగట్లేదు. నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నా ప్రభుత్వాలు మాత్రం కార్మికులకు కనీస వేతనాలు పెంచట్లేదు. పీడిత ప్రజలు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎర్రజెండా ఉద్యమిస్తుంది. రాబోయే కాలంలో మరింత సమరశీలంగా ఉద్యమాలు నిర్వహించేందుకు ఈ మహాసభలో కర్తవ్యాలు రూపొందించాలి.

– జే.మల్లిఖార్జున్, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు

### సమరశీల పోరాటాలతో ఎన్నో విజయాలు



సీపీఐ(ఎం) పీడిత ప్రజల పక్షాన ఎన్నో సమరశీల పోరాటాలు నిర్వహించి విజయాలు సాధించింది. జిల్లాలో భూ నిర్వాసితులు, కార్మికుల కనీస వేతన సమస్యలపై సీపీఐ(ఎం) అనేక పోరాటాలు చేసింది. దళితులపై జరుగుతున్న సామాజిక వివక్ష, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన ఫలితంగానే బాధితులకు న్యాయం చేకూరింది. మహిళల రక్షణ, భద్రతకు సంబంధించి అనేక రూపాల్లో కార్యక్రమాలు చేపట్టాం. గ్రామీణ పేదలు, కూలీలు, రైతు లు, వృత్తిదా రులు, కార్మికులు, కర్షకులు, దళితులు, గిరిజనులు, మైనార్టీ లు ఇలా అనేక తరగతులకు చెందిన ప్రజల సమస్యలపై సీపీఐ(ఎం) స్పందించి ఉద్యమాలు చేస్తోంది. మహాసభల్లో జిల్లా రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలపై చర్చించి రాబోయే కాలంలో చేపట్టాల్సిన భవిష్యత్ కర్తవ్యాలను రూపొందిస్తాం.

-జయరాజు, సంగారెడ్డి సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి

### మహాసభలు ఉద్యమ స్ఫూర్తిని కల్పించాయి



జహీరాబాద్‌లో జరుగుతున్న సీపీఐ(ఎం) జిల్లా మహాసభలు ఉద్యమ స్ఫూర్తిని కల్గించాయి. జహీరాబాద్ ప్రాంతంలో నిమ్జ్ బాధిత రైతులు, కూలీలు చేసిన పోరాటం ఎంతో ప్రభావం చూపింది. ఈ ప్రాంతంలో కార్మికులు కనీస వేతనాల కోసం కొట్లాడి సాధించుకున్నారు. కార్మికులు, రైతులు, కూలీల సమస్యలపై ఎర్రజెండా నిలకడగా పోరాడుతుంది. ఈ ప్రాంతంలో పార్టీ శ్రేణుల ఉత్తేజాన్ని చూస్తుంటే తమ జిల్లాలో కూడా ఉద్యమాన్ని మరింత సమరశీలంగా నిర్వహించేందుకు ఎంతో ఉపయోగపడుతుంది.

– మల్లారెడ్డి, సీపీఐ(ఎం)సిద్దిపేట జిల్లా కార్యదర్శి

### నిమ్జ్ పోరాట స్ఫూర్తితో కాళేశ్వరం ప్రాజెక్టు పోరాటం



జహీరాబాద్ ప్రాంతంలో నిర్వాసితులు నిర్వహించిన నిమ్జ్ పోరాట స్ఫూర్తితో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన నిర్వాసితులు పోరాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పేర ఎంతోమంది రైతుల నుండి భూములను తీసుకున్న గత ప్రభుత్వం వారికి సౌకర్యాలు కల్పించడంలో విఫలమైంది. బాధితుల పక్షాన పోరాడి ప్రభుత్వం మెడలు వంచేలా అనేక ఉద్యమాలు చేశాం. జహీరాబాద్‌లో నిమ్స్ బాధితులు చేసిన ఉద్యమం తమకెంతో స్ఫూర్తినిచ్చింది.

– ఎ.మల్లేశం, సీపీఐ(ఎం) మెదక్ జిల్లా కార్యదర్శి

### పీడిత వర్గాలకు ఎర్రజెండా అండా..



పీడిత వర్గాలకు చెందిన ప్రజలకు ఎర్రజెండా అండగా నిలుస్తుంది. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు వారి కష్టాలను తీర్చేందుకు ఉద్యమాలు చేసేది సీపీఐ(ఎం) మాత్రమే. బీజేపీ మతోన్మాద రాజకీయాల్ని ప్రజలు తిప్పికొట్టాలి. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల్ని నెరవేర్చడంతో నిర్లక్ష్యం చేస్తుంది. పారిశ్రామిక ప్రాంతంగా ఉన్న సంగారెడ్డి జిల్లాలో కార్మికులు శ్రమ దోపిడికి గురవుతున్నారు. వారి సమస్యలపై సీపీఐఎం పోరాటాలు చేస్తుంది.

– వాజిద్ అలీ, జిల్లా కమిటీ సభ్యులు

### మహిళలకు రక్షణ కరువు..



బూర్జువా ప్రభుత్వాల పాలనలో మహిళలు, ఆడపిల్లలకు రక్షణ కరువైంది. ఆడపిల్లలు బయటికి వెళితే క్షేమంగా ఇంటికి తిరిగిస్తుందన్న నమ్మకం లేదు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులు, అఘాయిత్యాలకు వ్యతిరేకంగా సీపీఐఎం పోరాడుతుంది. మహిళలు ఎదిరించి పోరాడినప్పుడే వారి సమస్యలు పరిష్కారం అవుతాయి. ఎర్రజెండ్ అని ఆయుధంగా తీసుకొని ఉద్యమించాలి.

– లక్ష్మీ, సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యురాలు

### పునరావాసం కల్పించే వరకు పోరాడుదాం



నిమ్జ్ భూ నిర్వాసితులకు పునరావాసం కల్పించే వరకు న్యాయ పోరాటం కొనసాగిస్తాం. గత ప్రభుత్వం జహీరాబాద్ ప్రాంతంలో నేమ్జో పరిశ్ర మను ఏర్పాటు చేయడంతో ఇక్కడున్న ఎంతో మంది రైతులు తమ విలువైన భూములను కోల్పోయి బజారున పడుతున్నారు. రైతులను ఏ రాజకీయ పార్టీ పట్టించుకోకపోయినప్పటికీ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు చేసి 2013 చట్ట ప్రకారం అసైన్డ్ పట్టా భూములకు సమానంగా నష్టపరిహారాన్ని సాధించుకున్నాం. భూ బాధితులకు ప్రభుత్వం కల్పించాల్సిన సౌకర్యాల న్నిటిని కల్పించేంత వరకు రైతులు భూములను సాగు చేసుకుంటారు.

– రామచంద్రం,సీపీఐ(ఎం)జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

## హత్నూర్‌లో కలెక్టర్ ఆకస్మిక పర్యటన

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, తహశీల్దార్ కార్యాలయంలో రికార్డుల తనిఖీ
- రెసిడెన్షియల్ హాస్టల్, కేజీబీవీల సందర్శన

నవతెలంగాణ-హత్నూర



సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలో జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి శనివారం ఆకస్మిక పర్యటన చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తనిఖీలు నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, తహశీల్దార్ కార్యాలయాన్ని, రెసిడెన్షియల్. కెజిబివి పాఠశాలను సందర్శించి.. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా రెసిడెన్షియల్ పాఠశాలలో భోజనం ఎలా వుంది అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం మెనూ ప్రకారం అందించాలని, మెరుగైన విద్య అందించాలని ప్రిన్సిపల్‌కు ఆదేశించారు. కస్తూర్బా పాఠశాలలో భోజనం ఎలా ఉన్నది.. సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెల్సుకున్నారు. వసతి గృహ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పాఠశాల ప్రిన్సిపల్‌కు ఆదేశించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి.. ఆసుపత్రిలో రోగులతో మాట్లాడారు. ఎలాంటి వైద్యం అందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. అనారోగ్యం బారిన పడిన వారికి సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పర్వీన్ షేక్, ఎంపీడీవో శంకర్, ఆర్ఐ శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో రూ.9 కోట్లతో విద్యుత్‌శాఖ పనులు

- విద్యుత్ శాఖ అభివృద్ధి పనులపై సమీక్ష

నవతెలంగాణ-జోగిపేట



అందోల్ నియోజకవర్గంలో విద్యుత్‌శాఖకు సంబంధించి మంజూరైన రూ.9 కోట్ల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు సంబంధించి సమీక్షా సమావేశాన్ని హైద్రాబాద్‌లోని మంత్రి నివాసంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో మేడ్చల్ చీఫ్ ఇంజనీర్ కామేష్, సంగారెడ్డి సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనాథ్, జోగిపేట డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు. నియోజకవర్గంలో పురోగతిలో ఉన్న పనుల వేగాన్ని సమీక్షించారు. రూ.9 కోట్ల అంచనాతో జరుగుతున్న పనుల పట్ల మంత్రి సంతృప్తిని వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎఫ్‌వై 2024-2025 కోసం ప్రోగ్రామ్ చేయబడిన అన్ని పనులు ప్రారంభించబడ్డాయని, రాబోయే వేసవిలోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. వేసవి మరియు రబీ సీజన్లలో ఆందోల్ నియోజకవర్గంలో విశ్వసనీయమైన విద్యుత్ సరఫరాను నిర్ధారించడానికి ఇది ఉపయోగపడుతుందన్నారు. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు (డీటీఆర్), 11 కేవీ ఇంటర్‌లింకింగ్ లైన్‌లు 33కేవీ సబ్‌స్టేషన్‌ల ఏర్పాటుతో సహా వ్యవసాయ మౌలిక సదుపాయాలు అత్యంత ప్రాధాన్యతగా చేపడుతున్నట్లు తెలిపారు. వ్యవసాయ కార్యకలాపాలకు తోడ్పడటానికి ఈ ప్రాంతంలో మొత్తం విద్యుత్ మెరుగుపరచడానికి అవసరమైన ఈ పనులను సకాలంలో పూర్తి చేయవలసిన అవసరాన్ని మంత్రి అధికారులకు సూచించారు. గృహ, వ్యవసాయ రంగానికి అవసరమైన విద్యుత్ సరఫరాల విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని మంత్రి సూచించారు.

## అధిక సాంద్రత పద్ధతిపై రైతులకు అవగాహన



నవతెలంగాణ-చౌటకూర్

మండల కేంద్రంలోని రైతువేదికలో ఏరువాక కేంద్రం సంగుపేట్ వారి ఆధ్వర్యంలో అధిక సాంద్రత పద్ధతిలో జాఫర్ అనే రైతు వేసిన అధిక సాంద్రత పత్తి పంటపై శనివారం క్షేత్ర దినోత్సవం (ఐసీఎఆర్ - సీఐసీఆర్ నాగ్‌పూర్) నిర్వహించారు. ఏరువాక కేంద్రం సమన్వయకర్త శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ మాట్లాడుతూ.. అధిక సాంద్రత పద్ధతిలో వేసిన పత్తి పంట గురించి రైతులతో మాట్లాడుతూ.. అధిక సాంద్రత పత్తి సాగు ద్వారా మేలైన దిగుబడి వస్తుందన్నారు. పంట కూడా గులాబి రంగు కాయతొల్చు పురుగు బారి నుంచి తట్టుకుంటుందన్నారు. తద్వారా నికర ఆదాయాన్ని పొందవచ్చు అన్నారు. ఈ పద్ధతిలో పూత, కాత బాగా వచ్చిందని నాగయ్య అనే రైతు ఇతర రైతులతో పంచుకున్నాడు. అలాగే శాస్త్రవేత్త కే. సరిత మాట్లాడుతూ.. వరి, పత్తి పంటలో పాటించాల్సిన సమగ్ర ఎరువుల యాజమాన్యం, పురుగుల ఉధృతి గమనించుట కొరకు ఎకరాకు 4-6 లింగాకర్షక బుట్టలు అమర్చు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, వైపి - రేఖా మనోజ్, శ్రీకాంత్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ బీమా చెక్కు అందజేత

నవతెలంగాణ-కల్హేర్



నిజాంపేట గ్రామానికి చెందిన కార్పే బాలకృష్ణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. ఆయనకు బీఆర్ఎస్ సభ్యత్వం ఉండగా.. పార్టీ నుంచి ప్రమాద బీమా మంజూరైంది. ఇందుకు సంబంధించిన రూ.2లక్షల పార్టీ బీమా చెక్కును మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి స్వయంగా మృతుని ఇంటికి వెళ్లి శనవారం అందజే శారు. ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో ఏ రాజకీయ పార్టీలో కూడా పార్టీ సభ్యత్వ బీమా లేదని .. రెండు లక్షల రూపాయల సభ్యత్వ బీమా కలిగిన ఒకే ఒక్క పార్టీ బీఆర్ఎస్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ జెడ్పీటీసీ రవీందర్ నాయక్, ఖేడ్ మున్సిపల్ కౌన్సిలర్ ముజ మిల్, వైస్ ఎంపీపీ సాయి రెడ్డి, తాజా మాజీ సర్పంచ్ జగదీశ్వర చారీ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సెల్‌ఫోన్లు దూరంగా ఉంచాలి

నవతెలంగాణ-మునిపల్లి



విద్యార్థులకు సెల్‌ఫోన్లు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని సీఎంఓ వెంకటేశం, మండల విద్యాధికారి భీమ్‌సింగ్ అన్నారు. మండలంలోని మల్లికార్జున్‌పల్లి జెడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్ పాఠశాలల్లో శనివారం నిర్వహించిన తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశానికి వారు హాజరై విద్యార్థుల తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు.పిల్లలు ఇంట్లో చదువుకోవడానికి ఒక ప్రత్యేక గది ఏర్పాటు చేయాలని.. పిల్లలు హెూమ్ వర్క్ ఎలా చేస్తున్నారో రోజూ పరిశీలించాలన్నారు. పిల్లలను ప్రతీరోజు పాఠశాలకు పంపాలని, అలాగే విద్యార్థుల అభ్యాసన అభివృద్ధి తెలుసుకునేందుకు విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశానికి ప్రతినెల మూడో శనివారం హాజరుకావాలని, సూచించారు. విద్యార్థులకు సెల్‌ఫోన్‌ను దూరంగా ఉంచాలని తల్లిదండ్రులకు సూచించారు. విద్యార్థులు చదువుకు సమయం కేటాయించాలని, పిల్లలకు పుస్తకాలు, న్యూస్ పేపర్ చదివే అలవాటు చేయించాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మెన్ పాల్గొన్నారు.

## నల్లబడుతున్న తెల్ల బంగారం

నవతెలంగాణ-పుల్కల్

ఆరుగాలం కష్టపడి పండించిన పత్తి పంట చేతికొచ్చే సమయంలో వర్షం పడుతుండడంతో.. చేనుమీదే పత్తి నల్లబడుతోంది. అధిక వడ్డీలకు రుణాలు తెచ్చి పెట్టుబడులు పెట్టామని.. పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. క్వింటాలుకు రూ.12,000 చెల్లిస్తేనే.. పంటసాగుకు తెచ్చిన అప్పులు కొంత మేర తీరు తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కాబట్టి ఇప్పటికైనా అధికారులు స్పందించి.. దెబ్బతిన్న పంటలపై సర్వే చేపట్టి ప్రభుత్వం తరవున ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



## రైతులను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్

నవతెలంగాణ-సంగారెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నమ్మించి మోసం చేసిందని సీడీసీ మాజీ చైర్మెన్ కాసాల బుచ్చిరెడ్డి అన్నారు. సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ నేతలతో కలిసి శనివారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న మోసాలను అన్నదాతలు గమనిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో కర్రుకాల్చి వాత పెట్టడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.ఆంక్షలు లేకుండా రైతు భరోసా ఇవ్వాల్సిందే అని.. 20 లక్షల మందికి రుణమాఫీ చేసే వరకు బీఆర్ఎస్ పోరాటం చేస్తుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, కార్యదర్శి నర్సింలు, శ్రీనివాస్, విఠల్, కౌన్సిలర్ విష్ణు, చింటూ తదితరులు పాల్గొన్నారు.

## కాసాలలో ఘనంగా గృహ వెలుగు పండుగ

నవతెలంగాణ-హత్నూర



దక్షిణ ఇండియా సంఘం సీఎస్ఐ కాసాల పాస్టేట్‌లో గృహ వెలుగు పండుగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నర్సాపూర్, కొన్యాల, కాసాల, పాస్టేట్ ఇన్చార్జి గురువులు రెవ రెండ్ సందీప్, అమృత రావు, కాంతరావు, గురువులు హాజరై మాట్లాడుతూ.. ఒకరి పట్ల ఒకరు ప్రేమ, అభిమానం కలిగి ఉండాలన్నారు.సంఘంలోని స్త్రీలందరూ తెల్లటి వస్త్రాలు ధరించి చేతిలో క్యాండిల్స్ వెలిగించి గ్రామ పూర విధులకుండా సంగీత వాయిద్యాలు ఆటపాటలతో ఘనంగా ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సిలువ చుట్టూ దీపాలు వెలిగించారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు పాముల భాస్కర్ ,నాయి కోటి ప్రభాకర్,గూడెపు లక్ష్మణ్, సాకలి సుభాష్,నీరుడి దాస్, పాముల సాగర్, బేగరీ గిరి ప్రసాద్, రమేష్,స్త్రీల సెక్రటరీ గీత భాస్కర్, సంఘంలోని స్త్రీలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## పనికోసం వెళ్లిన వ్యక్తి అదృశ్యం

నవతెలంగాణ-జోగిపేట



పనికోసం ఇంటినుంచి బయటికి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటనఅందోల్ మండల పరిధిలోని తాడ్మన్నూరు గ్రామంలో జరిగింది. పోలీసులు, బాధితుడు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మ్యాతరి లక్ష్మయ్య గత 20 రోజుల క్రితం పని నిమిత్తం మెదక్ పట్టణానికి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దాంతో లక్ష్మయ్య భార్య మెదక్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది.

## దళితులపై పెరుగుతున్న కుల వివక్ష దాడులు




**నవతెలంగాణ-తూప్రాన్**

మెదక్ జిల్లా శివంపేట మండలం దొంతి గ్రామంలో అగ్ర కులస్తులు దళితులపై శనివారం భౌతిక దాడికి దిగారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం కోదాసు స్వామి, కోదాసు పూలమ్మ, కోదాసు అరవింద ఎస్సీ మాల కులమునకు చెందిన వారిపై శనివారం ఉదయం 10 గంటల ప్రాంతంలో అదే గ్రామానికి చెందిన మల్లవరం వెంకటరెడ్డి కులం పేరుతో బూతు మాటలు తిడుతూ, అవహేళన చేస్తూ, భౌతికంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఇందుకుగాను ఎమ్మార్పీఎస్ మెదక్ జిల్లా అధ్యక్షులు చెట్లపల్లి యాదగిరి, మాసాయిపేట యాదగిరి, అనుబంధ సంఘాలవారు దళితులపై జరిగిన చర్యను ఖండిస్తూ దాడి చేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మెదక్ జిల్లాలో దళితులపై రోజురోజుకు దాడులు అధికమవుతున్నాయి. ఇకనైనా పోలీస్ యంత్రాంగం దళితులపై నిర్లక్ష్యం వహించకుండా భౌతిక దాడులకు దిగుతున్న అగ్రవర్గ అగ్రకులాల వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భౌతిక దాడిలో గాయపడిన వారికి రక్షణ కల్పించాలని, లేనిపక్షంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## ప్రజల దాహార్తి తీర్చిన ఎన్ఎంఆర్ ట్రస్ట్

- టీపీసీసీ ఎస్సీసెల్ నేత సాల్మాన్ రాజ్



**నవతెలంగాణ-పాపన్నపేట**

ఎన్ఎంఆర్ ట్రస్ట్ ప్రజల దాహార్తి తీర్చిందని టీపీసీసీఎస్సీ సెల్ నాయకులు సాల్మాన్ రాజ్ తెలిపారు. పాపన్నపేట మండలం అన్నారం గ్రామంలో గత కొంత కాలంగా నీటి సమస్య ఉత్పన్నం కావడంతో విషయాన్ని కాంగ్రెస్ ఎంపీ కాంటెస్టెడ్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. వెంటనే స్పందించిన ఆయన గ్రామానికి ఎన్ఎంఆర్ ట్రస్ట్ ద్వారా బోరు మోటారు ఇప్పించడం జరిగిందన్నారు. వెంటనే గ్రామంలోని బోరుబావిలో బిగించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ కు గ్రామ ప్రజల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోష ప్రసాద్, మైనార్టీ నాయకులు, ఇస్మాయిల్ యూత్ కాంగ్రెస్ నాయకులు మిస్టర్ రవి, పాషా, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మంచి వాతావరణాన్ని కల్పించాలి

- డీఈఓ రాధా కిషన్



**నవతెలంగాణ-పాపన్నపేట**

విద్యార్థులకు మంచిగా చదువుకునే వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైన, ఉపాధ్యాయులపైన ఉందని జిల్లా విద్యాధికారి రాధా కిషన్ అన్నారు. శనివారం పొడ్చన్ పల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులకు చదువుకునే వాతావరణం కల్పించడంలో భాగంగా ఇంటిలోనే చదువుకునే మూలను ఏర్పాటు చేయమని చెప్పారు. తల్లిదండ్రులు, విద్యార్థుల చదువుకు తమవంతు సహకారం అందించాలని కోరారు. ఇంటి వద్ద పిల్లల్లో ప్రవర్తనలో మార్పు గమనిస్తే పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయులతో చర్చించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాపన్నపేట ఎంఈఓ ప్రతాపరెడ్డి, ఉపధ్యాయులు శ్రీనివాస్, కిషన్, భద్రయ్య, భవానీప్రసాద్, శివలింగగౌడ్, శివశంకర్, గన్ను సుబ్బారావు, చంద్రకాంత్, డాక్టర్ దేవయ్య, శశికళ, కంప్యూటర్ ఆపరేటర్ పాషా, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పాఠశాలలో వర్క్ బుక్స్ పంపిణీ




**నవతెలంగాణ-చేగుంట**

చేగుంట ఉమ్మడి మండలం చెట్ల తిమ్మాయి పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పులిగుంట తండా ఎంపీపీఎస్ పాఠశాలలో శనివారం జీఎస్ఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ వారు గ్రామ మాజీ సర్పంచ్ మోహన్ రాథోడ్ ఆధ్వర్యంలో పిల్లలకు వర్క్ బుక్స్‌ను పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నవీన్ కుమార్, ఉపాధ్యాయులు శంకర్‌లు జీఎస్ఆర్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు పాఠశాల అభివృద్ధికి చేస్తున్న సహకారానికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులు, ఫౌండేషన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ సెలక్షన్స్

- ప్రిన్సిపల్ హుస్సేన్



**నవతెలంగాణ-మెదక్ టౌన్**

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఎన్‌సీసి సెలక్షన్స్ నిర్వహించినట్టు ప్రిన్సిపల్ డాక్టర్ హుస్సేన్ తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో చేరిన విద్యార్థులకు ఈ కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు. ఈ సెలక్షన్స్‌లో సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో వంద మందిని ఎంపిక చేసినట్టు తెలిపారు. ఎన్‌సీసీ ఇన్చార్జి అధికారి సురేందర్ రావు మాట్లాడుతూ ఎంపిక చేయబడిన విద్యార్థులకు మూడు సంవత్సరాల పాటు చక్కటి శిక్షణను ఇస్తామని, ఈ శిక్షణ ద్వారా విద్యార్థులు ఆర్మీ, పోలీసు కానిస్టేబుల్, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ తదితర ఉద్యోగాలకు అర్హతను పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి ఆర్మీ ఆఫీసర్ మహేష్ బచత్, గురుప్రీత్ సింగ్ ఆధ్వర్యంలో ఎంపికను నిర్వహించారు అని అన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన బీఎస్పీ నాయకులు



**నవ తెలంగాణ-నర్సాపూర్**

శివంపేట మండల పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను శనివారం బీఎస్పీ నాయకులు పరామర్శించారు. బిఎస్పీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ కూతాడి నరసింహులు, నాయకులు జనార్దన్ గౌడ్, సారా రవి గౌడ్, విఘ్నేశ్వర్ గౌడ్, సత్యనారాయణలు మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## ట్రాక్టర్ బోల్తా పడి మహిళ మృతి



**నవతెలంగాణ-కౌడిపల్లి**

ట్రాక్టర్ బోల్తా పడి మహిళ మృతి చెందిన సంఘటన కౌడిపల్లి శివారులోని మల్లు కుంట శివారులో కూకుట్ల పల్లి రోడ్డుపై శనివారం చోటుచేసుకుంది. కుటుంబీకుల కథనం ప్రకారం. కౌడిపల్లి మండలం బుజిరంపేట వెంకటాపూర్ (బి) గ్రామానికి చెందిన బడిగంటి సయమ్మ (54) ఇంటి నిర్మాణం కోసం అదే గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమాని యాదవ్ గౌడ్ ట్రాక్టర్‌లో కౌడిపల్లి నుంచి ఇంటికి వెళుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు బోల్తా పడి యాదమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## తప్పిపోయిన దాసు శవం పెద్ద చెరువులో లభ్యం



**నవతెలంగాణ-తూప్రాన్**

మున్సిపల్ కేంద్రంలోని పెద్ద చెరువులో మాసాయిపేట మండలం చెట్లతిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన బందెల దాసు (40) శవం శనివారం లభ్యమైందని ఎస్సై శివానంద్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం చెట్లతిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన బందెల దాసు గత 10 రోజుల క్రితం ఇంట్లో నుండి వెళ్లి తిరిగి రాకపోవడంతో దాసు తల్లిదండ్రులు, సమీప బంధువులను ఆరా తీశారు. కానీ తప్పిపోయిన వ్యక్తి జాడ తెలియ రాలేదు. దాసు తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. చెరువులో ఒక వ్యక్తి శవం ఉన్నదని తెలుసుకున్న తూప్రాన్ పోలీసులు, గ్రామంలోని పెద్దలు చెరువు ప్రాంతానికి వెళ్లి చెరులో ఉన్న శవాన్ని గజ ఈతగాళ్ల సహాయంతో బయటికి తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై శివానంద్ తెలిపారు.

## ఫిట్స్ వల్ల నీట మునిగి వ్యక్తి మృతి



**నవతెలంగాణ-నార్సింగి**

చేపల వేటకు వెళ్లిన వ్యక్తి నీట మునిగి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని నర్సంపల్లి గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఉడుత శ్రీనివాస్ (50)కు భార్య యాదమ్మ, కూతుర్లు శిరీష, శ్రీలత ఒక కొడుకు బాలరాజు ఉండగా, పెద్ద కుమార్తెకి పెళ్లి జరిపించారు. శ్రీనివాస్ భార్యా పిల్లలు మేడ్చల్‌లో పనులు చేసుకుంటూ జీవనం చేస్తుండగా అతను గ్రామంలోనే ఉంటూ గ్రామ మత్స్యకారుల సంఘం తరపున చేపల వేట చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇదిలాఉండగా శుక్రవారం సాయంత్రం చేపల వేట కోసం చెరువులో వల వేసి శనివారం వేకువజామున నాలుగు గంటల ప్రాంతంలో వలలు తీయడానికి వెళ్ళాడు. చెరువులో వలలు తీస్తుండగా ఫిట్స్ రావడంతో వల చుట్టుకుని నీట మునిగి మృతి చెందాడని తెలిపారు. సంఘటనా స్థలానికి సిబ్బందితో చేరుకున్న ఎస్ఐ అహ్మద్ మొహిఉద్దీన్ కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రానికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

## టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నూతన కమిటీ ఎన్నిక



**నవతెలంగాణ-పెద్ద శంకరంపేట**

మండలం టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు హీరాలాల్ ఎన్నికల అధికారిగా, పరిశీలకులుగా జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరామిరెడ్డి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు సంగయ్యల ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. పెద్ద శంకరంపేట మండలం టీపీటీఎఫ్ సంఘం అధ్యక్షులుగా టీ.మారుతి ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ అబ్దుల్ షమీ ఉపాధ్యక్షులుగా బీతయ్య సుగుణమని సాయిబాబా కార్యదర్శులుగా భార్గవ్ రాధిక మౌనిక జిల్లా కౌన్సిలర్ గా విజయ్ కుమార్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎం.సంగమేశ్వర్ రాజేశ్వర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# దళితులపై దాడి చేసినవారిని వెంటనే అరెస్ట్ చేయాలి

- సీపీఐ(ఎం) నర్సాపూర్ డివిజన్ కార్యదర్శి కడారి నాగరాజు

**నవతెలంగాణ-కొల్చారం**

మెదక్ జిల్లా కొల్చారం మండలం తుక్కాపూర్ గ్రామంలో దళితులపై జరిగిన సంఘటన హేయమైన చర్య అని సీపీఐ(ఎం) నర్సాపూర్ డివిజన్ కార్యదర్శి కడారి నాగరాజు, ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు పుర్ర ప్రభాకర్, జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఆకుల పెంటయ్యలు అన్నారు. శనివారం దాడికి గురైన దళితులను కలిసిన ఆయన విలేకర్లతో మాట్లాడారు. తుక్కాపూర్ గ్రామంలో బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మహిళలు బతుకమ్మ ఆడుతున్న క్రమంలో ఆకస్మాత్తుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో పక్కనుంచి దళిత యువకుడు రమేష్ ఫోన్ టార్చ్ లైట్ వేసుకొని వెళ్తున్న క్రమంలో అమ్మాయి ఫోటో తీసావు అంటూ బీసీ సామాజిక వర్గానికి చెందిన కొందరు వ్యక్తులు అతనిపై బూతు మాటలు తిడుతూ భౌతిక దాడి చేశారని తెలిపారు. ఇంతలోనే రమేష్ కుటుంబ సభ్యులు ఈ విషయమై కలుగజేసుకుని ప్రశ్నించగా వారిపై కూడా దాడి చేయడం కులాన్ని విమర్శిస్తూ చిన్నచూపు చూస్తూ మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తెలిపారు. దాడిలో ఐలి రాములు, నవీన్, కిరణ్, నరేష్, కష్టల గోపాల్, ధర్జన మల్లమ్మ లు చిన్నలచికారీ శేఖయ్య, ధనయ్య, దేవయ్య, సౌందర్య పాపవ్వ, రమేష్ పై పిడి గుద్దులు గుద్దుతూ, రాళ్లతో, కట్టెలతో దాడి చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజా ప్రతినిధుల అండదండలతోనే దళితులపై గ్రామంలో దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు నిందితులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసుకున్నప్పటికీ నిందితులను ఎందుకు అరెస్టు చేయలేదో అధికారులు చెప్పాలని డిమాండ్ చేసారు. అలాగే నర్సాపూర్ నియోజకవర్గంలో నర్సాపూర్, కౌడిపల్లి, శివ్వంపేట, కొల్చారం, వెల్దుర్తి మండలాల్లో దళితులపై దాడులు జరుగుతున్నా అధికారులు అవగాహనా సాధస్సులు జరపాకపోవడం నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనమన్నారు. ఇప్పటికైనా



నిందితులను వెంటనే అరెస్ట్ చేసి రిమైండ్‌కు పంపాలని డిమాండ్ చేసారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున్న ప్రజా, దళిత సంఘాలతో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో దళిత జర్నలిస్టు జైపాల్ ఎమ్మార్పీఎస్ సంజీవులు, దళితులు దుర్గయ్య, పాపయ్య, దేవయ్య, తదితరులు ఉన్నారు.

## ఏడుపాయల వనదుర్గామాతను దర్శించుకున్న హై కోర్టు జడ్జి

- హరిత హొటల్ వద్ద పోలీస్ గౌరవ వందన
- స్వాగతం పలికిన మెదక్ జిల్లా జడ్జి లక్ష్మి శారద, సీనియర్ సివిల్ జడ్జి జితేందర్, ఎస్పీ ఉదయ్ కుమార్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు,



**నవతెలంగాణ -పాపన్నపేట**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గా భవాని మాతను తెలంగాణ హై కోర్టు జడ్జి జస్టిస్ విజయసేన్ రెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ సిబ్బంది, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. ఆలయ సిబ్బంది ఆయనకు శాలువాతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. జస్టిస్ విజయ సేన్ రెడ్డి ఏడుపాయలకు చేరుకోగానే హరిత రెస్టారెంట్ వద్ద జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. మెదక్ జిల్లా జడ్జ్, ఎస్పీ, అదనపు కలెక్టర్, పూల బోకేలతో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమం లో మెదక్ జూనియర్ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి రీటా లాల్ చంద్, నర్సాపూర్ జూనియర్ సివిల్ జడ్జి అనిత, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సుభాష్ గౌడ్, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ శ్రీపతిరావు, న్యాయవాదులు ప్రతాపరెడ్డి, జనార్దన్ రెడ్డి బాలయ్య , శ్రీనివాస్ గౌడ్, ప్రశాంత్, చిరంజీవి. రవి గౌడ్ జిల్లా పాలన యంత్రాంగం బార్ అసోసియేషన్ ప్రతినిధులు పోలీస్ రెవిన్యూ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు రైతు భరోసా వెంటనే విడుదల చేయాలి

- సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం



**నవతెలంగాణ-నర్సాపూర్**

కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నర్సాపూర్ ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా శనివారం ధర్నా రాస్తారోకోతో పాటు సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ పంట పెట్టుబడి సహాయంగా అందించే రైతు భరోసాను నిలిపివేస్తున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పడం సిగ్గుచేటన్నారు. సీఎం రేవంత్ రెడ్డి దసరా పండుగకు రైతు భరోసా ఇస్తామన్న హామీ ఇప్పటివరకు అమలు కాకపోవడం విచారకరమన్నారు. రైతులను ముంచుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి త్వరలో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ అయ్యేవరకురైతు భరోసా ఇచ్చేవరకురైతుల పక్షాన పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలోమాజీ ఆత్మ కమిటీ చైర్మన్ శివకుమార్, మాజీ వైస్ ఎంపీపీ వెంకట నర్సింగ్ రావు, మాజీ జెడ్పిటిసి బాబ్యానాయక్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు భోగ శేఖర్, మాజీ సర్పంచులు లావణ్య రవి,సురేష్ గౌడ్, వెంకటేష్ గౌడ్, ఉమ్లా నాయక్, సందీప్, శ్రీశైలం యాదవ్, ఆంజనేయులు, నాయకులు మురళి, లక్ష్మీనరసయ్య, విఠల్ , శ్రీనివాస్ రెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పంట రక్షణ కోసం కరెంటు పెడితే ప్రాణం పోయింది



**నవతెలంగాణ-వెల్దుర్తి**

పంట రక్షణ కోసం రైతు ఎన్నో పాట్లు పడతాడు అడవి జంతువులు, పక్షుల నుండి పంటలు కాపాడుకోవడానికి రకరకాల పద్ధతుల ద్వారా పంట రక్షించుకోవడం రైతు చేసే పద్ధతులే ఒక్కొక్కసారి రైతులను కబలిస్తుంది. ఇదే మాదిరిగా పంటను రక్షణ కోసం ఏర్పాటచేసిన ముండ్ల కంచకు కరెంటు సరఫరా పెట్టి అడివి పందుల రాకుండా ఏర్పాటు చేసుకున్న అదే కరెంటు రైతుకు మరణానికి దారి తీసింది. ఈ సంఘటన మండల పరిధి యశ్వంతరావు పట గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. శనివారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ విధంగా ఉన్నాయి యశ్వంత రావు పేట గ్రామానికి చెందిన యాదయ్య (46) తనకున్న 5 గుంటల వ్యవసాయ పొలానికి రక్షణ కోసం ఏర్పాటు చేసుకున్న ముళ్లకంచకు కరెంటు సరఫరా అయ్యేవిధంగా విద్యుత్ వైర్లను బిగించాడు. శుక్రవారం రాత్రి అన్నం తిన్న తర్వాత పది గంటల ప్రాంతంలో పొలం వద్దకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లిపో యాడని శనివారం ఉదయం వరకు ఇంటికి రాకపోవడంతో వెళ్లి చూసే వరకు కరెం టు షాక్ గురై మృతి చెందినట్లు మృతుని భార్య ఇందిరా పోలీస్ స్టేషన్ వచ్చి ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు. మృతుని భార్య ఇందిరా ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి వెళ్లి కేసు నమోదు చేసి శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతునికి ఇద్దరు కొడుకులు ఉన్నారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

## ఆదర్శ పాఠశాల పనితీరుపై విద్యార్థుల తల్లిదండ్రుల ఆగ్రహం



**నవతెలంగాణ-పెద్ద శంకరంపేట**

పెద్ద శంకరం పేటలోని ఆదర్శ పాఠశాల పనితీరుపై విద్యార్థులు తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం పెద్ద శంకరంపేటలోని ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో తల్లిదండ్రులు తమ పిల్లలకు సరైన వసతులు కల్పించడం లేదని ఉపాధ్యాయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో సరైన కనీస వసతులు కల్పించకపోవడం పట్ల తాగునీటి సదుపాయం ఏర్పాటు చేయకపోవడంపై తీవ్రంగా మండిపడ్డారు. విద్యార్థులకు సరైన నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించడం లేదని, మధ్యాహ్న భోజనంలో పుచ్చు కూరగాయలు తెచ్చి పిల్లలకు పెడుతున్నారని ఆరోపించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం సరిగ్గా పెట్టకపోవడంతో విద్యార్థులు ఇంటి నుంచి టిఫిన్ బాక్సులు వాటర్ బాటిల్స్ తెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించి మోడల్ పాఠశాలలో మౌలిక సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ శ్రీలత ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు చదువును దూరం చేస్తున్న ప్రభుత్వం

- విద్యార్థుల చదువులతో ఆటలాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- రాష్ట్రంలో 8271 వేల కోట్ల స్కాలర్షిప్ విడుదల చేయాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంతోష్, అజయ్ కుమార్




**నవ తెలంగాణ-మెదక్ టౌన్**

తెలంగాణ రాష్ట్రంలో గత ఆరు సంవత్సరాల నుంచి స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ లేక విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి కనిపిస్తుందని ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంతోష్, అజయ్ కుమార్ అన్నారు. స్కాలర్షిప్‌లు, ఫీజియంబర్స్మెంట్ లేక ప్రైవేట్ మేనేజ్మెంట్లు ఇంటర్, పీజీ, డిగ్రీ కళాశాలలు మూసివేస్తున్నారన్నారు. ఈ సంవత్సరంలో రాష్ట్రంలో 116 ఇంటర్ కాలేజీలు 72 డిగ్రీ కాలేజీలు 29 ఇంజనీరింగ్ కాలేజీ 47 పారామెడికల్ కాలేజీలు మూతపడ్డాయని పేర్కొన్నారు. పేద విద్యార్థులు చదువుకు దూరం అవుతూ చదువుకోలేక మధ్యలోనే కూలి పని చేసుకునే దుస్థితిని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తుందని, వెంటనే స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యార్థులు చదువుకున్న తర్వాత హయ్యర్ ఎడ్యుకేషన్ చదవడానికి ప్రైవేట్ మేనేజ్మెంట్లు అడ్మిషన్స్ ఫీజు కడితేనే సర్టిఫికెట్ ఇస్తానంటూ విద్యార్థులను ఆవేదనలకు గురి చేస్తున్నాయని, దీని ద్వారా విద్యార్థులు పై చదువులు చదువుకోలేక విద్యకు దూరమవుతున్నారు. 8271 వేల కోట్ల స్కాలర్షిప్‌ను తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ మెదక్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గీత, ఇంటర్ కళాశాల ప్రిన్సిపల్ సిద్దార్థ, ఇంటర్ కళాశాల ప్రిన్సిపల్ స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జుబేర్, సిఐటియు కోశాధికారి కే నరసమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## గూప్-3 పరీక్ష ఏర్పాట్లను పరిశీలించిన ఆర్డీవో



**నవతెలంగాణ-తూప్రాన్**

తూప్రాన్ పట్టణంలో గ్రూప్ 3 పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో ఆర్డీవో జయచంద్రారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో శనివారం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కాలేజిలో 288 అభ్యర్థులు, శ్రీ చైతన్య జూనియర్ కాలేజిలో 288 అభ్యర్థులు, నవంబర్ 17,18 తేదిలలో జరుగనున్న గ్రూప్-3 పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్షకు సంబంధించిన పరీక్ష కేంద్రంలోని వసతుల విషయమై సౌకర్యాలను వాకబు చేశారు. ప్రస్తుతం ఉన్న సిబ్బందితో మాట్లాడుతూ జూనియర్ కాలేజీలోని గదులను, ఉన్న బెంచీలు, కరెంటు, డ్రింకింగ్ వాటర్ మొదలైన వాటి గురించి విచారణ చేసి ఇట్టి సౌకర్యాలను పరీక్ష తేదీలోపు చేపట్టాలని సజావుగా జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనప్రాయంగా ఆదేశాలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ మన్నె ప్రభుదాస్, రెవెన్యూ సిబ్బంది, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం



**నవతెలంగాణ-పెద్దశంకరంపేట**

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రైతుబంధు ఇవ్వనందుకు నిరసనగా మండల కేంద్రమైన పెద్ద శంకరంపేటలో మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో బి.ఆర్.ఎస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను శనివారం దగ్ధం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే రైతులకు రైతు భరోసా ద్వారా నిధులను అమలు చేయాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పేట మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్.. బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు జంగం రాఘవులు సురేష్ గౌడ్ వెంకట రెడ్డి మాణిక్ రెడ్డి శంకర్ గౌడ్ కోణం అంజయ్య ఆయా గ్రామాల వి ఆర్ ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

- తల్లిదండ్రుల సమావేశంలో ఎంఈఓ సత్తయ్య



**నవతెలంగాణ-కొండపాక**

ప్రాథమిక, ఉన్నత స్థాయి విద్యార్థి దశ ఎంతో కీలకమైందని ఆ సమయంలో వారి చదువులపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కుకునూరు పల్లి మండల ఎంఈఓ బి. సత్తయ్య తెలిపారు. కుకునూరు పల్లి మండలం తిప్పారం ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమిష్టి కృషితో విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలన్నారు. సెల్ ఫోన్, టీవీలు వారికి దూరంగా ఉంచాలని అప్పుడే చదువుపై శ్రద్ధ వస్తుందన్నారు. ప్రణాళికబద్ధంగా విద్యార్థులను చదువుకునేలా ప్రోత్సహించాలన్నారు. చక్కగా చదువుకొంటేనే భవిష్యత్తులో మంచి ఉద్యోగాలు సంపాదించవచ్చని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలోనే అన్ని వసతులతో కూడిన విద్య అందుతుందన్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రాజ్ బహదూర్, రవి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఏఏపిసి సభ్యులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డిచిత్రపటం దగ్ధం



**నవతెలంగాణ-నిజాంపేట్**

నిజాంపేట మండల కేంద్రంగా స్థానిక టిఆర్ఎస్ నాయకులు శనివారం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాన్ని తగలబెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు రుణమాఫీ చేయని సీఎం రేవంత్ రెడ్డి రైతుబంధు ఇవ్వని సీఎం రాజీనామా చేయాలని, నినాదాలు చేస్తూ రేవంత్ రెడ్డి చిత్రపటాన్ని తగలబెట్టారు. ఈ కార్యక్రమంలో మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, రాజు, రవీందర్, స్వామి గౌడ్, పప్పుల బాపురెడ్డి, నాయిని లక్ష్మణ్, అబ్దుల్ అజీజ్, బిజ్జ సంపత్, నవీన్, అబ్దుల్ దుర్గా రెడ్డి, ఎమ్మ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలపై ఉపాధ్యాయులకు అవగాహన

- తూప్రాన్ ఆర్డీవో జయచంద్రా రెడ్డి




**నవతెలంగాణ-తూప్రాన్**

బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పట్టభద్రులు, ఉపా ధ్యాయ ఎమ్మెల్సీల ఎన్నికలపై డివిజన్ పరిధిలోని ఉపాధ్యాయులకు తూప్రాన్ రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం.జయచంద్రా రెడ్డి శనివారం అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ త్వరలోనే నిర్వహించనున్న ఎమ్మెల్సీ ఎన్నికల విధుల నిర్వహణపై ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులను సమావేశపరిచి ఎమ్మెల్సీ ఎన్నికలకు నిర్వహిం చే క్రమంలో పలు సూచనలను చేశారు. ప్రస్తుతా నికి ఉపాధ్యాయ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియ అన్ని రెవెన్యూ మండల, డివిజన్ కేంద్రాలలో కొనసాగుతుం దన్నారు. అర్హులైన పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఓటు హక్కును నమోదు చేసుకునే విధంగా సహకరిం చాలన్నారు. పాఠశాల, స్కూల్ సిబ్బందికి ఆర్డీవో జయచం ద్రా రెడ్డి శిక్షణ తరగతులను నిర్వహించి అవగాహన కల్పిం చారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఎంఈఓ పర్వతి సత్యనా రాయణ, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## యువత స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి



**నవతెలంగాణ-ములుగు**

యువత అంది వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్థికంగా ఎదగాలని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి నర్సారెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా ములుగు మండలం వంటిమామిడిలో శ్రీ బాంకెట్ ఫంక్షన్ హాల్ హోటల్‌ను శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవం లో మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షులు సింగిరెడ్డి హరి వర్ధన్ రెడ్డి, ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని, పదిమందికి ఉపాధి కల్పించే విధంగా తోడ్పాటు కావాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా డిసిసిబి అధ్యక్షుడు అంజిరెడ్డి, గజ్వేల్ యూత్ విభాగం అధ్యక్షులు కడపల కృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తమ్మల శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్, నర్సాపూర్ మాజీ ఎంపీటీసీ రాజేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కడపల నరసింహారెడ్డి బైలంపూర్ మాజీ ఎంపిటిసి లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు .

## మట్టి రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు

**నవతెలంగాణ-కోహెడ:** కోహెడ మండలంలో ఆగస్టు,సెప్టెంబర్ నెలలలో కురిసిన భారీ వర్షాలతో దెబ్బతిన్న మట్టి రోడ్లకు మరమ్మతులు చేపట్టేందుకు నిధులు మంజూరయ్యాయి. మండలంలోని పోరెడ్డిపల్లి నుంచి అప్పిస కాలనీ, ఎర్రగుంటపల్లి నుంచి ఇందుర్తి రోడ్, ఎర్రగుంటపల్లి నుంచి రాంచంద్రపూర్,వింజపల్లి నుంచి పెరకల గడ్డ గ్రామాల్లో పలు చోట్ల ప్రధాన రోడ్లు దెబ్బతిన్నాయి. దీంతో రెండు నెలల క్రితం అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి నివేదికలు రూపొందించి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించారు. ఇందులో భాగంగా మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో గ్రామానికి రెండు లక్షల చొప్పున 8 లక్షల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది.

నవతెలంగాణ

సిద్దిపేట

ఆదివారం | 20 అక్టోబర్ 2024 | www.navatelangana.com



## సీసీఐ పత్తికొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

- డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి.



నవ తెలంగాణ-గజ్వేల్

పత్తికొనుగొలు ప్రక్రియను సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ద్వారా మాత్రమే కొనుగొలు చేస్తే పత్తి రైతులు పడ్డ కష్టానికి ఎంతొకొంత ప్రతిఫలం దక్కుతుందని డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి తెలిపారు. శనివారం గజ్వేల్ ఉన్న జిన్నింగ్ మిల్లుకు వెళ్ళిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గంలో ఎక్కువగా పత్తి పంటపైనే అదారపడి జివనం కొనసాగిస్తున్న రైతులకు పత్తిసాగు ప్రారంభంలో అనావృష్టితో మొక్కలు సరిగ్గా మెలకెత్తక ఇబ్బందులు పడినట్లు ఆయన గుర్తు చేశారు. అన్ని కష్టాలను అదిగమించి పండించిన రైతులకు సీసీఐ కొనుగోలు కేంద్రాలు మెదలు కాకపోవడం వలన దళారులను ఆశ్రయించి రూ. 1000 నుంచి 1200 వరకు ప్రతి క్వింటాల్‌కు నష్టపొతున్న పరిస్థితుందన్నారు. ప్రభుత్వం స్పందించి సీసీఐ కొనుగొలు కేంద్రాలను త్వరితగతిన ఏర్పాటు చేసి రైతులను అదుకొవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో నాయకులు చంద్రం,రైతు స్వామి ఉన్నారు.

## పీఏసీఎస్ సెంటర్లలో వడ్లు విక్రయించాలి

- చైర్మెన్ ఎస్.కైలాష్




నవతెలంగాణ-దుబ్బాక

పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి..ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను పొందాలని పీఏసీఎస్ చైర్మెన్ శేర్ల కైలాష్ రైతులకు విజ్ఞప్తి చేశారు. శనివారం దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని లచ్చపేట, మల్లాయపల్లి వార్డుల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను 10వ,11వ వార్డుల కౌన్సిలర్లు కూరపాటి బంగారయ్య, నందాల శ్రీజ శ్రీకాంత్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మెన్ కాల్వ నరేష్, డైరెక్టర్లు, సీఈఓ ఎం.మోహన్, కరుణాకర్, ఏఈఓ కవిత, పలువురు కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థుల అభ్యున్నతే తమ ట్రస్టు లక్ష్యం

- చైర్మన్ తలకొక్కుల లక్ష్మణ్



నవతెలంగాణ-వర్గల్

గ్రామీణ ప్రాంతాలలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే పేద విద్యార్థుల అభ్యున్నతే తమ లక్ష్యమని తలకొక్కుల చంద్రకళ, లక్ష్మణ్ చారిట బుల్ ట్రస్ట్ చైర్మన్ లక్ష్మణ్ పేర్కొన్నారు. శనివారం చౌదరిపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఎల్ఈడి టివి, స్క్రీన్ అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతుండగా, పదిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు మెడల్స్, నగదు ప్రోత్సాహకాలు, పాఠశాలల్లో తాగునీటి వసతులు, విద్యార్థులకు స్టడీ మెటీరియల్, నోట్ బుక్స్ పంపిణీ, ఎల్ఈడి టీవీల అందజేత తదితర కార్యక్రమాలు చేపట్టి పేద విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు స్పష్టం చేశారు. అంతేకాకుండా ఉన్నత విద్య కోసం ఆర్థికంగా ప్రోత్సహిస్తుండగా, తాను చిన్నతనంలో పడిన కష్టాలు నేటితరం పేద విద్యార్థులు పడకూడదనే లక్ష్యంతో వారి అభ్యున్నతికి సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం చేస్తున్నట్లు చెప్పారు. పేద విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వంతో పాటు దాతల సహకారం ఎంతో అవసరమని హెచ్ఎం జైపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ తలకొక్కుల లక్ష్మణ్, ట్రస్ట్ నిర్వాహకులు దుర్గా ప్రసాద్, మధు సూధన్ ప్రధానోపాధ్యాయులు జైపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు ఎల్లండి శ్రీనివాస్ రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల గ్రామ కమిటీలలో ఏకపక్ష నిర్ణయాలు వద్దు


- గ్రామ సభల ద్వారా కమిటీలను ఎన్నుకోవాలి



నవ తెలంగాణ-కొండపాక

రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన డబుల్ బెడ్ రూమ్‌లకు సంబంధించి ఇందిరమ్మ ఇండ్ల పేరుతో గ్రామ కమిటీలు ఏకపక్షంగా ఏర్పాటు చేయడం సరైన పద్ధతి కాదని సిపిఎం మండల కార్యదర్శి అమ్ముల బాల్ నర్సయ్య తెలిపారు. ఆయన శనివారం వెలికట్ట చౌరస్తా వద్ద విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఇందిరమ్మ ఇండ్ల కమిటీ నిర్ణయాన్ని కిందిస్థాయిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏకపక్షంగా నాలుగు గోడల మధ్య కూర్చొని ప్రకటించడం సరైంది కాదన్నారు. గ్రామ పంచాయతీలో ఎట్లాంటి సభలు సమావేశాలు నిర్వహించకుండా ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయడం సరికాదన్నారు. ఇప్పటికి వేసిన కమిటీలను రద్దు చేసి ప్రజల మధ్య గ్రామసభ ఏర్పాటు చేసి గ్రామసభ, ప్రజల సమక్షంలో కమిటీ సభ్యులను ఎన్నుకోవాలని కోరారు. కమిటీలు ప్రజల కోసం పనిచేసే విధంగా ఉండాలి కానీ ప్రజా వ్యతిరేకత రాకుండా ఉండాలని కోరారు.పనిచేసే వారిని కమిటీలో పెట్టాలని అన్నారు.లేని పక్షంలో ఆందోళనకు దిగవలసి వస్తుందని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


## రక్త దానం చేసిన ఆర్ఎంపీ కరుణాకర్




నవతెలంగాణ-గజ్వేల్

మండలం చిన్న ఆరేపల్లి గ్రామంలో దోమకొండ నవ్య పురిటి నొప్పులతో గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేరగా ఆమెను పరీక్షించిన వైద్యురాలు రక్తం తక్కువగా ఉందని రక్తమవసరమని సమాచారం ఇచ్చారు. శనివారం ఈ విషయం తెలుసుకున్న ఆర్ఎంపీ కర్ణాకర్ ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదానం చేశారు. ఇప్పటికి అనేకసార్లు రక్తదానం చేసినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. కాగా బ్లడ్ గ్రూపు అరుదైన ఓ నెగిటివ్ అని చెప్పగానే అత్యవసరంగా ఆసుపత్రికి వచ్చి రక్తదానం చేసినట్లు వైద్యులు తెలిపారు. సామాజిక సేవలో కరుణాకర్ ముందుంటారని పలువు అబినందించారు. ప్రతి ఒక్కరూ రక్తదాన కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు.

## కెడంను కలిసిన నాయకులు



నవతెలంగాణ-బెజ్జంకి

జిల్లా గ్రంధాలయ చైర్మన్ కెడం లింగమూర్తిని జిల్లా కేంద్రంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానిం చి శుభాకాంక్షలు తెలిపినట్లు ఆర్టీఐ ప్రచార కమిటీ చైర్మన్ రాసూరి మల్లికార్జున్ శనివారం తెలిపారు. ఈ కార్యక్రమంలో వెన్న రాజు,మిట్టపల్లి చెన్నారెడ్డి,సంగెం మధు,మాంకాల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నట్లు మల్లికార్జున్ తెలిపారు.

## విద్యార్థులకు రాత పుస్తకాల పంపిణీ




నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రానికి అనుబంధ గ్రామం ఎల్లంపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం లయన్స్ క్లబ్ కోశాధికారి బోనాల రాజు అధ్వర్యంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నారోజు శంకరా చారి రాత పుస్తకాలు పంపిణీ చేశారు.

## స్లాటర్ హౌజ్‌లో మాత్రమే మేకలను... గొర్రెలను వదించాలి

- మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్



నవతెలంగాణ-సిద్దిపేట

ప్రజలకు శుచికరమైన, నాణ్యమైన మాంసాన్ని అందించాలనే ఉద్దేశ్యంతో నిర్మించిన స్లాటర్ హౌజ్‌లో మాత్రమే మేకలను, గొర్రెలను వదించాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ విక్రయదారులకు సూచించారు. శనివారం ఇంటిగ్రేటెడ్ మార్కెట్ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్‌లు ముద్ర వేసిన తర్వాతనే మాంసాన్ని మార్కెట్లో విక్రయించాలన్నారు. సిద్దిపేట శివారులోని ఇర్కోడ్ వద్ద 2 ఎకరాల స్థలంలో మాంసం విక్రయదారుల కొరకు ఆధునిక సౌకర్యాలతో నిర్మించిన స్లాటర్ హౌజ్‌లో మాత్రమే మేకలను వదించాలన్నారు. కబేళాకు సులభంగా వెళ్ళుటకు మంచి సిసి రహదారులను వేయించటం జరిగిందని, 1.20 లక్షల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్‌ను, చుట్టూ ప్రహరీ, మరుగు దొడ్లు అన్ని సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. ఆధునిక పద్ధతిలో మాంసం వ్యర్థాలతో గ్యాస్‌ను ఉత్పత్తి చేసే ఇఫ్లూమెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశామన్నారు. మాంసాన్ని నిల్వ చేసేందుకు ప్రత్యేకంగా ఫ్రీజర్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, మాంస విక్రయదారులు పాల్గొన్నారు.

## మత్స్యకారులను రోడ్డున పడేసిన కాంగ్రెస్ ప్రభుత్వం




నవతెలంగాణ-నంగునూరు

తెలంగాణ మత్స్యకారుల కుటుంబాలను కాంగ్రెస్ ప్రభుత్వం రోడ్డు పాలు చేసిందని బీఆర్ఎస్ నాయకులు, ముదిరాజ్ యూత్ అధ్యక్షులు కోండిల్ల రాజు ఆరోపించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణలో రేవంత్ రెడ్డి సర్కార్ ఏర్పడ్డాక మత్స్యకారులను పట్టించుకోవడం లేదన్నారు. ముదిరాజులను, మత్స్యకారులను కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు చూస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వంలో కేసీఆర్, హరీశ్ రావులు మత్స్యకారులకు ముఖ్యంగా ముదిరాజులకు పెద్దపీట వేశారని గుర్తు చేశారు. ప్రతి సంవత్సరం వర్షాలు పడగానే చేప పిల్లల పంపిణీ చేశారని చెప్పారు. అదేవిధంగా సబ్సిడీ కింద ద్విచక్ర వాహనాలు, చేపల రవాణా కోసం ఫోర్ వీలర్స్, ఆటోలు, మత్స్యకార మహిళలకు చేపల ఫాస్ట్ ఫుడ్ సెంటర్ కోసం మొబైల్ క్యాంటీన్ వాహనాలు ఇలా అనేక సంక్షేమ పథకాలను అందించిన ఘనత కేసీఆర్ హరీశ్ రావులదేనన్నారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం మూకుమ్మడిగా మత్స్యకారులు, ముదిరాజుల పైన సవతి తల్లి ప్రేమను చూపిస్తూ పైసా కూడా కేటాయించడం లేదని ఆరోపించారు.

# ఆయిల్ ఫామ్ సాగులో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి

- జిల్లా కలెక్టర్ మను చౌదరి
- ఆయిల్ ఫామ్ రైతులకు అవగాహన సదస్సు






నవతెలంగాణ-నంగునూరు

ఆయిల్ ఫామ్ సాగులో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి సూచించారు. శనివారం మండలంలోని నర్మెట గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఆయిల్ ఫాం కర్మాగార ఆవరణలో జిల్లా ఉద్యానవన శాఖ, జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. సిద్దిపేట నియోజకవర్గ స్థాయి ఆయిల్ ఫామ్ రైతుల అవగాహన సదస్సు జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి అధ్యక్షత వహించారు. ముందుగా ఆయిల్ ఫామ్ సాగు గురించి రైతులకు అవగాహన కల్పించడానికి ఆయా యూనివర్సిటీల నుంచి విచ్చేసిన శాస్త్రవేత్తలు సుబ్బారావు, రాజశేఖరరెడ్డి, శ్రీనివాస్ రెడ్డిలు ఆయిల్ ఫామ్ మొదటి దశ నుంచి ఎరువుల వాడకం, చీడపీడల నుంచి నివారణ, నీటి శాతం, దున్నే విధానం లాంటి ఇతరత్ర విషయాల గూర్చి క్లుప్తంగా రైతులకు వివరించారు. ఆయిల్ ఫాం సాగు చేస్తున్న రైతులు వారి అనుభవాలు, సమస్యలు గూర్చి తెలిపారు. ఆయిల్ ఫామ్ సాగులో అగ్రికల్చర్, హార్టికల్చర్ అధికారులు పంటల పరిస్థితిని ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, అడవి పందుల బెడద చాలా ఉందని దానికి నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈజీఎస్‌లో మెయింటెనెన్స్, సబ్సిడీ అమౌంట్‌ను కొంతకాలంగా జమ కావట్లేదని రైతులు కలెక్టర్‌కు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నర్మెటలో రూ.300 కోట్ల తో ఆయిల్ ఫాం కర్మాగారం వేగంగా నిర్మాణాన్ని చేపడుతున్నామన్నారు. ఇందులో క్రూడ్ ఫామ్ ఆయిల్, కర్నల్ పామ్ ఆయిల్ ప్లాంట్‌లలో ఆయిల్ తయారవుతుందని తెలిపారు. ఈ కర్మాగారానికి రంగనాయక సాగర్ నుంచి నీటిని నిలువ చేసుకోవడానికి ఒక పాండు నిర్మించామని, ఇందులో ఎలాంటి వేస్ట్ పదార్థమనేది ఉండదన్నారు. క్లీన్ ప్లాంట్ గా, క్వాలిటీతో కూడిన ఆయిల్‌ను ఈ కర్మాగారం అందజేయడం జరుగుతుందని తెలిపారు. రైతులు తెలిపిన విధంగా తప్పనిసరిగా అగ్రికల్చర్, హార్టికల్చర్ అధికారులు ఆయా రైతుల ఆయిల్ ఫామ్ క్షేత్రాల దగ్గరికి వెళ్ళి, రైతు వేదికల వారిగా సమావేశాలు నిర్వహించి రైతులకు ఉన్న సమస్యలను నివృత్తి చేయాలని ఆదేశించారు. అగ్రికల్చర్, హార్టికల్చర్ అధికారులకు సైతం ఆయిల్ ఫామ్ వివిధ దశల గురించి అన్ని విధాల ట్రెనింగ్ ఇచ్చి జిల్లా, డివిజన్, మండల స్థాయిలలో ఏఏ సంవత్సరంలో ఎలా ఎదుర్కోవాలో ఇలాంటి విషయాలతో కూడిన పాంప్లెట్లను తయారుచేస్తామని, రైతులకు ఎలాంటి సమస్య రాకుండా ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేవిధంగా చూస్తామని తెలిపారు. అలాగే ఫర్టిలైజర్ షాపులలో ఆయిల్ ఫామ్‌కు సంబంధించిన ఎరువులు లభించడం లేదని తెలుపగా రాష్ట్రస్థాయి అధికారులతో సంప్రదింపులు జరిపి తప్పకుండా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అడవి పందుల బెడద నివారణకు సోలార్ ఫెన్సింగ్ అనేది ఖర్చుతో కూడుకున్నదని, అవసరాన్ని బట్టి ఆయా రైతుల వివరాలను తీసుకుని సోలార్ ఫెన్సింగ్ కోసం ప్రపోజల్ పంపుతానని తెలిపారు. కొత్తగా ఆసక్తి ఉన్న రైతులకు నమ్మకం కలగడానికి ఇదివరకే దిగుబడితో లాభార్జన పొందుతున్న రైతుల వ్యవసాయ క్షేత్రాలను సందర్శించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి సువర్ణ, జిల్లా వ్యవసాయ అధికారి టి.రాధిక, ఏడీఏ వై.పద్మ, మండల వ్యవసాయ అధికారి వి.గీత, వివిధ మండలాల వ్యవసాయ అధికారులు, హార్టికల్చర్ అధికారులు, ఫ్యాక్టరీ ఇంచార్జి కె.ప్రణేశ్ గౌడ్, శాస్త్రవేత్తలు, ఆయిల్ ఫామ్ సిబ్బంది, సాగు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్ జేఏసీ చైర్మన్ పదవికి పరమేశ్వర్ రాజీనామా చేయాలి


- డివిజన్ అంశాన్ని నీరుగార్చే కుట్రలను ఖండించండి
- కాంగ్రెస్ నాయకునిగా కొనసాగుతూ జేఏసీ చైర్మన్ గా కొనసాగే అర్హత మీకెక్కడిది
- సీపీఐ(ఎం) చేర్యాల మండల కార్యదర్శి, జిల్లా కమిటీ సభ్యులు



నవతెలంగాణ-చేర్యాల

అధికార కాంగ్రెస్ నాయకునిగా ఉంటూ జేఏసీ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న డాక్టర్ రామగల్ల పరమేశ్వర్ వెంటనే చేర్యాల రెవెన్యూ డివిజన్ జేఏసీ చైర్మన్ పదవికి రాజీనామా చేయాలని సీపీఐ(ఎం) చేర్యాల మండల కార్యదర్శి కొంగరి వెంకట మావో, జిల్లా కమిటీ సభ్యులు బండకింది అరుణ్ కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సీపీఐ(ఎం)కార్యాలయంలో శనివారం ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఎర్రబోస్ అశోక్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో వెంకట మావో, అరుణ్ కుమార్ మాట్లాడుతూ అధికార కాంగ్రెస్ జనగామ నియోజకవర్గ ఇంచార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి చేయిస్తున్న మోసపూరిత ఉచ్చులో పరమేశ్వర్ పడొద్దన్నారు. చేర్యాల ప్రాంతాన్ని రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలనే పోరాటాన్ని నీరుగార్చే కుట్రలను ప్రజలు, ప్రజాస్వామ్య వాదులు, మేధావులందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూల్మిట్ట మండలాల ప్రజలందరి చిరకాల కోరిక అయిన చేర్యాలను రెవెన్యూ డివిజన్ గా ప్రభుత్వం ప్రకటించాలని అన్నారు.గతంలో నియోజకవర్గ కేంద్రంగా ఉన్న చేర్యాలను తిరిగి సాధించుకోవాలని గత ఎనిమిది సంవత్సరాలుగా ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమై ఈ ప్రాంత కుల సంఘాలు, మేధావులు, ప్రతిపక్ష పార్టీల ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాలను కలుపుకొని జేఏసీగా ఏర్పడి పోరాడిన చరిత్ర ఈ ప్రాంత ప్రజలకు ఉందని, ఈ చరిత్రను కాల రాయడం, పోరాటాన్ని నీరుగార్చడం కోసం జేఏసీ చైర్మన్ పదవిని అడ్డుపెట్టుకొని తన సొంత ప్రయోజ నాలు నెరవేర్చుకోవడం కోసం అధికార కాంగ్రెస్ నాయకులుగా కొనసాగుతున్న డాక్టర్ పరమేశ్వర్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయకుండా కాంగ్రెస్ లోనే కొనసాగుతూ జేఏసీ చైర్మన్‌గా ప్రకటించుకోవడం లో ఆంతర్యం ఏమిటని సీపీఐ(ఎం)గా ప్రశ్నిస్తునామన్నారు. రెవెన్యూ డివిజన్ పోరాటాన్ని నీరుగార్చే కుట్రలను మానుకునే విధంగా కాంగ్రెస్ అధికార పార్టీకి రాజీనామా చేయడమో, రెవెన్యూ డివిజన్ జేఏసీ నుండి తప్పుకోవడమో తేల్చుకోవాలన్నారు. లేనిపక్షంలో ప్రతిపక్ష పార్టీలు, ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, మేధావులు ఏకమై తగువిధంగా స్పందించి రాబోయే రోజుల్లో చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా నియోజకవర్గ కేంద్రంగా అధికార పార్టీ ప్రకటించేంతవరకు అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని పోరాటం నిర్వహిస్తామని,పోరాటంలో స్వచ్ఛందంగా అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కాశెట్టి ఆంజనేయులు, రాళ్ల బండి భాస్కర్, బియ్య సిద్దులు, రాళ్ల బండి చందు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులను ఆదుకోకుంటే కేసు నమోదు చేయాలి



నవతెలంగాణ-సిద్దిపేట

భాష బీడీ కంపెనీ యజమాన్యం దిగి రాకపోతే లేబర్ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేయాలని, కంపెనీని మూసి వేయకుండా కార్మికులను ఆదుకోవాలని హెచ్ఎంఎస్ జాతీయ కార్యదర్శి సుదర్శన్ రావు, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ఇదారి మల్లేశంలు అన్నారు. భాషా బీడీ కంపెనీ మూసివేస్తున్న సందర్భంగా ఏసీఎల్ శ్రీనివాస్‌తో కలసి బీడీ సంఘం ప్రతినిధులతో కార్మికులు, సంఘం ప్రతినిధులు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చర్చలు విఫలమైనట్లు తెలిపారు. బీడీ కంపెనీ యజమానులు తమ వద్ద 22 మంది మాత్రమే పనిచేస్తున్నారని, ప్రభుత్వ అనుమతి లేకుండానే కంపెనీని మూసివేస్తామని అబద్ధపు మాటలు చెప్పారన్నారు. కంపెనీలో దాదాపుగా 800 మంది బీడీ కార్మికులు పనిచేసున్నారని, యజమాన్యం తప్పుడు లెక్కలు చూపిస్తుందన్నారు. కార్మికులు భాషా బీడీ కంపెనీ వద్ద పనిచేస్తున్నట్లు సంఘం వద్ద సాక్ష్యాలు ఉన్నాయన్నారు. కంపెనీ ఇచ్చిన ఐడెంటిటీ కార్డు, కార్మికులకు నెలనెలా వారి బ్యాంకు ఖాతాలలో వేస్తున్న బటువాడకు సంబంధించిన సాక్ష్యాలు ఉన్నాయన్నారు. కంపెనీ యజమాన్యం తప్పుడు లెక్కలు చూపిస్తూ ప్రభుత్వాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తుందన్నారు. ఏసిఎల్ సాక్ష్యాలను పరిశీలించి, తన పరిధి వరకు పని చేస్తానని, ఈ విషయంలో పై అధికారి డిసిఎల్‌కి రాసి పంపిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్మికులు ఐక్యమత్యంతో ఉండాలని, అప్పుడే మనకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు మధు, కార్యదర్శి లక్ష్మణ్, వివిధ గ్రామాల నుంచి వచ్చిన బీడీ కార్మికులు మంజుల, లత, మంగ, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

## కమిషన్ల పనులకే కేటీఆర్, హరీష్ రావుల ప్రాధాన్యత


- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

అభివృద్ధి పేరిట ఆర్థిక విధ్వంసం చేసిన కేసీఆర్ కనీసం భవనాల అద్దెలు కూడా చెల్లించలేని దుస్థితికి రాష్ట్రాన్ని దివాలా తీయించినట్లు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి ఆరోపించారు. శనివారం గజ్వేల్ మండలం అక్కారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రాన్ని పదేళ్లపాటు పాలించిన కేసీఆర్ కుటుంబం కేవలం తమకు కమిషన్లు వచ్చే పనులకే ప్రాధాన్యత ఇచ్చారన్నారు. రాష్ట్ర అభివృద్ధి, పేదల సంక్షేమాన్ని జీర్ణించుకోలేని ప్రతిపక్ష బిఆర్ఎస్ నేతలు ఉనికి కాపాడుకునేందుకు మూసి, హైడ్రా నిర్వాసితులను రెచ్చగొడుతున్నట్లు స్పష్టం చేశారు. అయితే బాధితులను ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంటూ వారిని ఒప్పించి ఖాళీ చేయిస్తుండగా, అండగా ఉంటామని కేసులు వేస్తూ హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకుంటున్నట్లు చెప్పారు. చిన్నపాటి వర్షానికే జంట నగరాలు జలమయం అవుతుండగా, ప్రభుత్వానికి మంచి పేరు రావద్దనే లక్ష్యంతో బిఆర్ఎస్, బిజెపిలు ముందుకెళుతున్నట్లు తెలిపారు. రిజిష్టార్ కార్యాలయాలు, గురుకులాలకు గత 30 నెలలుగా అద్దెలు చెల్లించకపోవడం, కమిషన్లు ఇవ్వని కాంట్రాక్టర్ల బిల్లులు మంజూరి చేయకపోవడం, ఆర్థిక ప్రయోజనం జరిగే మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కెసిఆర్ కిట్టు, బతుకమ్మ చీరలు వంటి పథకాలకు ప్రాధాన్యత ఇచ్చి దండుకున్నట్లు స్పష్టం చేశారు. ఆరు గ్యారెంటీల పథకాలు, ఉద్యోగ నోటిఫికేషన్లతో పేదలు, యువత హర్షం వ్యక్తం చేస్తుండగా, ఏదో ఒక సాకు చూపించి నిరుద్యోగులను రెచ్చగొడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఒంటేరు నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, మాజీ చైర్మన్ తాడేపల్లి భాస్కర్, యాదయ్య, నాయకులు గంగిశెట్టి రాజు, సమీర్ సుభాష్ చంద్రబోస్, రాజు యాదవ్, రామగౌడ్, మాజీ ఎంపీటీసీ, కవిత రాజు, కటకం రాజు, బుడిగే ఎల్లం, డప్పు ప్రశాంత్, బుడిగే లక్ష్మన్ తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సేవలు నిర్వీర్యం




నవతెలంగాణ-గజ్వేల్

కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో వైద్య సేవలు నిర్వీర్యమయ్యాయని బీఆర్ఎస్ గజ్వేల్ ఇన్చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి మండిపడ్డారు. శనివారం గజ్వేల్ జిల్లా ఆసుపత్రి, మాతా శిశు ఆసుపత్రిని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. గర్భిణీ స్త్రీలకు, ఔట్ పేషెంట్లకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. పలు విషయాలు గర్భిణీ స్త్రీలు, ఔట్ పేషెంట్లు వంటేరు దృష్టికి తీసుకుపోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ 20 కోట్లతో కేసీఆర్ ప్రభుత్వం గజ్వేల్‌లో అధునాతనంగా నిర్మించిన జిల్లా ఆసుపత్రిలో పూర్తిస్థాయి వైద్యమందక పేదలు చాల ఇబ్బందులు పడుతున్నారన్నారు. రేవంత్ రెడ్డి సర్కార్ గజ్వేల్ ప్రజలపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. మాతా శిశు ఆసుపత్రిలో వైద్య సేవలను పరిశీ లించి వైద్యుల వద్ద వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తు తం ప్రభుత్వ దవఖానాలలో సరిపోయే మందులు కూడా ఇవ్వడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వ ఆసుపత్రులలో మందులు దొరకక ప్రజలు ప్రైవేటుగా కొనుక్కోవాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటినుండి బాలింతలకు కిట్లను కూడా పంపిణీ చేయడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. గతంలోని కేసీఆర్ ప్రభుత్వం కెసిఆర్ కిట్టు, న్యూట్రిషన్ కిట్లను గర్భిణీలకు అందించారని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ విధానాల వలన ప్రభుత్వ ఆసుపత్రులలో 30% డెలివరీలు తగ్గాయన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ నాయకులు కబ్జాలకు పాల్పడుతున్నారని, సెటిల్మెంట్లు చేసుకుంటున్నారన్నారు. కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసిన రూ.170 కోట్ల నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆసుపత్రి ఎదుట బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేపడతామని హెచ్చరించారు. సొంత దందాలు చేయడానికి పోటీపడు తున్న కాంగ్రెస్ నాయకులు వైద్యానికి నిధులు వెచ్చించడా నికి నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, వైస్ చైర్మన్ జకియుద్దీన్, కౌన్సిలర్లు గోపాల్ రెడ్డి, శ్రీనివాస్, మార్కాంటి కనకయ్య, బొగ్గుల చందు, మల్లేశం, ఆర్కే శ్రీనివాస్, నాయకులు అహ్మద్, సాయి పాల్గొన్నారు.

## వామ్మో కుక్కలు..!

- చీలాపూర్ పల్లి, గుండారంలో స్వైర విహారం
- ఒకే రోజు ముగ్గురిని గాయపర్చిన కుక్కలు..
- సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి బాధితులు..



నవతెలంగాణ-బెజ్జంకి


వీధుల్లో కుక్కలు స్వైర విహారం చేశాయి. భయాందోళనతో జనం పరుగులు పెట్టారు. మండలంలోని చీలాపూర్ పల్లి,గుండారం గ్రామాల్లో వీధి కుక్కలు ముగ్గురిని(చిన్నారి,ఇద్దరు వ్యక్తులు) గాయపర్చాయి. దీంతో బాధితుల పరిస్థితి విషమంగా ఉంది. బాధితులను చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఐసీయూలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం.

### పంచాయతీలు ఏం చేస్తోన్నాయి?

పంచాయతీలు ఏం చేస్తోన్నాయి..?అధికారులు ఏం చేస్తున్నారు..?వేతనాలు తీసుకోవడం లేదా..? ప్రత్యేకాధికారులు జాడలేరు?ఇంత అధ్వానమాంటూ అధికారుల తీరుపై ప్రజల్లో విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి వీధిలో పదుల సంఖ్యలో కుక్కలు కనిపిస్తున్నాయి. పాదచారులపై, వాహనదారులపై పరిగెత్తి మీదకు వస్తూ దాడి చేయడానికి యత్నిస్తున్నాయి. ప్రతినిత్యం ఎవరో ఒకరు గాయపడాల్సిన దుస్థితి నెలకొంది. ఒక్కోసారి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. రాత్రిపూట విధులు,పనులు ముగించుకొని వెళ్తున్న వారిపై వెంట పడుతున్నాయి. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు కోతులు, మరొకవైపు కుక్కలు దాడి చేస్తుండడంతో దిక్కుతోచని పరిస్థితి ఎదురవుతోంది.ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, మహిళలు కుక్కలు, కోతుల ధాటికి భయకంపితులవుతున్నా రు. పంచాయితీ అధికారులు ఆలోచించి తమను కుక్కలు, కోతుల బెడద నుండి కాపాడేందుకు తగిన చర్యలు తీసుకో వాలని మండలం లోని ప్రజలు అధి కారులను కోరు తున్నారు



## ఐద్వా రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలి





నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

అక్టోబర్ 21, 22, 23 తేదీలలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో జరిగే అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని ఐద్వా ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా కార్యాలయంలో రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్‌ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి అత్తిని శారద మాట్లాడుతూ దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై దాడులు అత్యాచారాలు హత్యలు పెరిగాయని విమర్శించారు. మహిళలపై అత్యాచారాలు చేసిన వారిని బిజెపి ప్రభుత్వం రక్షిస్తుందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలోమతోన్మాదంతో మహిళలు తినే ఆహారం మీద, కట్టుకునే బట్టల మీద, ఆచార వ్యవహారాల మీద ఆంక్షలు విధిస్తూ మహిళలను బానిసలుగా చూస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం మహిళా సాధికారిక చట్టం చేయాలని డిమాండ్ చేశారు. పేద మహిళలందరికీ నెలకు రూ.2500లు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిందని, అధికారంలోకొచ్చి పది నెలలు అవుతున్నా ఇచ్చిన హామీని అమలు చేసిన పాపాన పోలేదన్నారు. సామాజిక పింఛన్లు రూ. 2000ల నుంచి నాలుగు వేలకు పెంచాలన్నారు. వ్యవసాయ కార్మికులకురాష్ట్ర ప్రభుత్వం ఇస్తామన్న రూ.12000లను వెంటనే ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పదివేల కోట్ల రూపాయల ప్యాకేజీ ప్రకటించి మహిళలకు ఉచిత విద్య, వైద్యం, రక్షణ కల్పించాలన్నారు.డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణం ఇవ్వాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న మహిళా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మహిళలు పోరాటానికి సిద్ధం కావాలని కోరారు. రాష్ట్ర మహాసభల సందర్భంగా అక్టోబర్ 21వ తేదీన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో వేలాదిమంది మహిళలతో భారీ ప్రదర్శన, బహిరంగ నిర్వహిస్తున్నామన్నారు. ఈ బహిరంగ సభకు ఆల్ ఇండియా ఐద్వా జాతీయ నాయకురాలు మాజీ ఎంపీ బృందాకరత్ హాజరవుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలోఐద్వా జిల్లా అధ్యక్షురాలు సింగిరెడ్డి నవీన, మరియు జిల్లా సహాయ కార్యదర్శి శిరీష, పల్లవి, మానస పాల్గొన్నారు.

## నేటి యూటీఫ్ అవగాహన సదస్సును జయప్రదం చేయండి

- యూటీఫ్ జిల్లా కార్యదర్శి కొడిపల్లి ప్రశాంత్ కుమార్



నవతెలంగాణ-చేర్యాల

సిద్దిపేట జిల్లాలో నియామకమైన నూతన ఉపాధ్యాయులకు తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఆదివా రం విద్యా, సర్వీసు అంశాలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కొడిపల్లి ప్రశాంత్ కుమార్ తెలిపారు. మండల కేంద్రంలో శనివారం ప్రశాంత్ కుమార్ విలేకరులతో మాట్లాడుతూ ఈ అవగాహన సదస్సులో సర్వీస్, సెలవు నిబంధనలతోపాటు ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ-నూతన ఉపాధ్యాయుల పాత్ర అనే అంశాలపై అవగాహన కల్పించ డం జరుగుతుందన్నారు. సదస్సుకు ముఖ్య అతిథులుగా జిల్లా విద్యాశాఖ అధికారి ఈ.శ్రీనివాసరెడ్డి, టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎ.వెంకట్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ వలీ అహ్మద్, టి.యాదగిరి హాజరవుతారని జిల్లాలో డీఎస్సీ 2024 ద్వారా ఎంపికైన నూతన ఉపాధ్యాయులందరూ పెద్ద మొత్తంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## నేడు కరెంట్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండలం బందారం సబ్ స్టేషన్ పరిధిలో ఆదివారం పది గంటల నుంచి ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్ కో ఏఈ సత్యం తెలిపారు. మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. బందారం, అంకిరెడ్డిపల్లి, దర్గా గ్రామాల రైతులు, ప్రజలు సహకరించాలని కోరారు.

## పలు బాధిత కుటుంబాలను పరామర్శించిన హరీశ్ రావు



నవ తెలంగాణ-సిద్దిపేట

మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ గూడూరి శ్రీనివాస్ తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగ వారి కుటుంబాన్ని హరీశ్ రావు పరామర్శించారు. అదేవిధంగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ పార్టీ సీనియర్ నాయకులు గురజాడ శ్రీనివాస్‌ను పరామర్శించి, తన ఆరోగ్య పరిస్థితి అడిగి తెల్సుకున్నారు. శ్రీవాణి స్కూల్ ప్రిన్సిపాల్ రవీందర్ రెడ్డి తండ్రి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. చికిత్స జరిగి విశ్రాంతి తీసుకుంటున్న ఏఎస్ఎం శోభ ను పరామర్శించారు.

## జిల్లా జైలును సందర్శించిన డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అధారిటీ సెక్రటరీ

నవతెలంగాణ-సిద్దిపేట




జిల్లా జైలును శనివారం మధ్యాహ్నం డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అధారిటీ సెక్రటరీ స్వాతి రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా జైలు సూపరింటెండెంట్ వికాస్, జైలు సిబ్బందితో కలసి ఆమె ఖైదీల వంట గది, స్టోర్ రూమ్, టాయిలెట్స్ పరుశిలించారు. ఖైదీలకు కల్పిస్తున్న భోజన వసతుల గురించి జిల్లా జైలు సూపరింటెండెంట్‌ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఖైదీలతో మాట్లాడుతూ ఖైదీలు సత్ప్రవర్తనతో ఉండాలని సూచించారు. జైలులో మొత్తం 32 మంది ఖైదీలు ఉన్నారనీ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమములో లీగల్ ఎయిడ్ డిఫెన్సు కౌన్సెల్స్, ఎన్. బాలయ్య, శ్రీకర్ రెడ్డి, నిరేటి వెంకటేష్, సిహెచ్. రాజ్య లక్ష్మి జిల్లా న్యాయసేవాధికారసంస్థ సిబ్బంది ఎల్. మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మూఢనమ్మకాలను పారద్రోలాలి

- పిల్లలలో శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచుకోవాలి

నవతెలంగాణ-చేర్యాల



మూఢనమ్మకాలను పారద్రోలి, పిల్లలలో శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచుకోవాలని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అయోధ్య తెలిపారు. మండల పరిధిలోని ఆకునూరు ప్రాథమిక పాఠశాల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల (పీటీఎం) ప్రధానోపాధ్యాయులు ఎం. అయోధ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, ప్రగతిని గురించి సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మూఢనమ్మకాలను పారద్రోలి పిల్లలలో శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచడం ప్రాముఖ్యత గురించి ఉపాధ్యాయులు నరేష్ సైన్స్ ప్రయోగాల ద్వారా తల్లిదండ్రులు, పిల్లలకు కళ్లకు కట్టినట్లుగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీసీ మెంబర్ అందె అశోక్, ఉపాధ్యాయులు రాధాబాయి, శ్యామ్ సుందర్ రెడ్డి, ప్రేమ్ కుమార్, రాజయ్య, సమ్మయ్య, సరోజినీ దేవి, నరేష్, భవాని విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## దొంగల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-మద్దూరు



దొంగల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మద్దూరు ఎస్సై షేక్ మహబూబ్ కోరారు. శనివారం తెల్లవారుజామున నాలుగు గంటలకు మండల కేంద్రంలో వాహన తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలు దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతీ ఒక్కరు స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే దొంగతనాలు ఎక్కువగా జరగబోవన్నారు. పై అధికారుల ఆదేశాల మేరకు తెల్లవారుజామున నాలుగు గంటలకే వాహన తనిఖీ చేపట్టినట్టు చెప్పారు. వాహన తనిఖీలో ప్రొబేషనరీ ఎస్సై అరుణ్ కుమార్, కానిస్టేబుల్ క్రాంతి, సురేష్ తదితరులు ఉన్నారు.

## కుల, మత రహిత సమాజం నిర్మిద్దాం

- కుల,మత రహిత పోరాట సమితి జిల్లా కార్యదర్శి మొగిలి బిక్షపతి

నవతెలంగాణ-రాయపోల్



కుల మత రహిత సమాజం నిర్మించడంలో ప్రభుత్వాలు, ప్రజలందరూ కలిసి రావాలని కులమత రహిత పోరాట సమితి సిద్దిపేట జిల్లా కార్యదర్శి మొగిలి బిక్షపతి అన్నారు. శనివారం రాయపోల్ మండలం టెంకంపేట గ్రామంలో ప్రేమ వివాహం చేసుకున్న యువకుడి ఇంటిపై దాడి చేసిన బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయపోల్ మండలం టెంకంపేట గ్రామంలో బీసీ ముదిరాజ్, బీసీ కురుమ సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు యువతీ యువకులు ప్రేమ వివాహం చేసుకున్నారు. ఇది తెలిసిన యువతి కుటుంబ సభ్యులు యువకుడు ఇంటిపై తండ్రిపై దాడి చేశారు. ఇలాంటి దాడులు సరైనవి కావని కులమత బేధాలు లేకుండా ప్రజలందరూ కలిసి కలిసి ఉండాలన్నారు. దాడి చేసిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల జేఏసీ జిల్లా కార్యదర్శి చెప్యాల యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రానికి స్కూల్ మెటీరియల్స్ అందజేత

నవతెలంగాణ-చేర్యాల



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మాజీ మంత్రి, చేర్యాల ప్రాంతానికి చెందిన నిమ్మ రాజిరెడ్డి వర్ధంతి సందర్భంగా శనివారం చేర్యాల పట్టణ కేంద్రంలోని 11వ అంగన్వాడీ కేంద్రానికి మెటీరియల్స్‌ను అందజేశారు. నిమ్మరాజిరెడ్డి మూడవ కుమారుడు, కోడలు శ్రీనివాస్ రెడ్డి-అనిత రూ. 10 వేల విలువగల స్కూల్ మెటీరియల్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ రమాదేవి మాట్లాడుతూ పిల్లలకు సంబంధించిన ప్రీస్కూల్ మెటీరియల్‌తో నేర్చే ఆటపాటలు, విద్య వల్ల మంచి ఉత్సాహవంతులు అవుతారన్నారు. దాతలు నిమ్మ అనిత- శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో పిల్లలను చూడగానే వారిలో ఉత్సాహం కలిగిందన్నారు. పిల్లల ఉత్సాహం చూస్తే ఇంకా ఏదో చేయాలనిపించిందని సంతోషపడ్డారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ నాగమణి, గర్భిణీలు, బాలింతలు, అంగన్వాడి టీచర్ తాటిపాముల కృష్ణవేణి, ఆయా రాజమణి, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

## 27న బెజ్జంకిలో స్వేరోస్ సమావేశం

నవతెలంగాణ-సిద్దిపేట



బెజ్జంకి మండల కేంద్రములో ఈ నెల 27న జరగబోయే స్వేరోస్ నెట్వర్క్ నేషనల్ కన్వెన్షన్ మీటింగ్ ముఖ్య అతిథిగా డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ హాజరుకానున్నారని, సమావేశాన్ని స్వేరోస్ నెట్వర్క్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొనే విజయవంతం చేయాలని స్వేరోస్ నెట్వర్క్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు చిలకబత్తిని వీరన్న స్వేరో పిలుపునిచ్చారు. శనివారం ప్రెస్ క్లబ్ లో స్వేరోస్ నెట్వర్క్ జిల్లా కమిటీ అధ్యక్షులు ఉప్పులేటి బాబు స్వేరో ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల నుండి వస్తున్న వారితో పాటుగా, యావత్తు తెలంగాణ రాష్ట్రంలో పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్వేరో చీఫ్ కన్వీనర్ బలుగురి దుర్గన్న, స్వేరో ప్రధాన కార్యదర్శి దారమల్ల ప్రకాష్, స్వేరో రాష్ట్ర సభ్యులు ,ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జ్ బొర్ర సురేష్ కుమార్, పి పి ఎల్ ఉమ్మడి జిల్లా ఇంచార్జ్ కన్వీనర్ చాతలా సదానందం, గడప రాజు, లలిత రాణి పాల్గొన్నారు.

## నేడు ఎమ్మెల్యే పల్లా పర్యటన

నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు మండలాలలో నేడు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పర్యటించనున్నట్లు శనివారం ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. చేర్యాల మండల పరిధిలోని ముస్త్యాల, కొమురవెల్లి మండల పరిధిలోని మర్రి ముస్త్యాల, మద్దూరు మండలం మద్దూరు,కూటిగల్ గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభిస్తారని, అలాగే చేర్యాల పట్టణంలోని దుర్గామాత ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపింది.

## నాసిరకం విత్తనాలు, ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు

- దుబ్బాక ఏడిఏ కాంపాటి మల్లయ్య.

నవతెలంగాణ-రాయపోల్



రైతులకు నాసిరకం, కాలం చెల్లిన విత్తనాలు ఎరువులను విక్రయించకుండా నాణ్యమైన విత్తనాలు, ఎరువులను మాత్రమే ఫర్టిలైజర్ దుకాణ యజమానులు విక్రయించాలని దుబ్బాక ఏడిఏ కాంపాటి మల్లయ్య అన్నారు. శనివారం దౌల్తాబాద్ మండల కేంద్రంలో ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దౌల్తాబాద్ మండల వ్యాప్తంగా ఉన్న ఫర్టిలైజర్ దుకాణాలలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులను మాత్రమే రైతులకు విక్రయించాలన్నారు. నాసిరకం విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఫర్టిలైజర్ దుకాణాలలో రైతులు విత్తనాలు కానీ ఎరువులు కానీ కొనుగోలు చేస్తే తప్పనిసరిగా రసీదు ఇవ్వాలన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అధిక ధరలకు విక్రయాలు జరిపితే ఉపేక్షించేది లేదన్నారు. విత్తనాలు, పురుగుల మందులు, ఎరువుల స్టాక్ రిజిస్టర్ విధిగా నిర్వహించాలన్నారు. కాలం చెల్లిన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు రైతులకు విక్రయించినట్లయితే అటువంటి ఫర్టిలైజర్ డీలర్లపై కఠిన చర్యలు తీసుకోబడతాయన్నారు. ఫెర్టిలైజర్ దుకాణాలు నిరంతరం రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సంతోష్ కుమార్, ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

## జూదరుల అరెస్టు.. నగదు స్వాధీనం

నవతెలంగాణ-నంగునూరు



పేకాట స్థావరంపై పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. ఎస్సై ఎం.డి.అసీఫ్ కథనం ప్రకారం వివరాలిలా ఇలా ఉన్నాయి... నంగునూరు మండలం రాజగోపాలపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని బద్దిపడగ గ్రామ శివారులో కొంతమంది వ్యక్తులు కలసి పేకాట ఆడుతున్నారని నమ్మదగిన సమాచారంపై సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు, రాజగోపాలపేట పోలీసులు వెళ్లి రైడ్ చేయగా ముగ్గురు వ్యక్తులు పారిపోగా నలుగురుని అదుపులోకి తీసుకున్నారు .వారి వద్ద నుండి రూ. 24,480 లు, 06 మోటర్ సైకిల్లు, 04మొబైల్ ఫోన్లు, స్వాధీనం చేసుకున్నారు .పంగ లక్ష్మారెడ్డి, మహమ్మద్ ఖమ్రుద్దీన్, గడ్డమీద శ్రీనివాస్, పాకాల చంద్రంలు పేకాట ఆడి పట్టుబడ్డారు. పరకాల శ్రీనివాస్ రెడ్డి,రవి, పరకాల భాస్కర్ రెడ్డిలు పరారీలో ఉన్నారని చెప్పారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ అధికారులు, రాజగోపాలపేట ఎస్ఐ అసీఫ్ మాట్లాడుతూ సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.రాజగోపాల్ పేట పోలీసులు కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించారు.

# నర్మెట గ్రామంలో ఉద్రిక్తత

- హరీశ్ రావును అడ్డుకునేందుకు యత్నం
- కాంగ్రెస్, బీఆర్ఎస్ పోటాపోటీగా నినాదాలు
- భారీగా మోహరించిన పోలీసులు
- పంట వేసిన వారికే సదస్సుకు అవకాశం



నవతెలంగాణ-నంగునూరు

ఆయిల్ ఫామ్ అవగాహన సదస్సుకు హాజరయ్యేందుకు వస్తున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావును అడ్డుకునేందుకు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు సిద్ధమవడంతో సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట గ్రామంలో శనివారం ఉద్రిక్తత నెలకొంది. ఆయిల్ ఫామ్ సాగు చేసిన రైతులకు నంగునూరు మండలం నర్మెట ఆయిల్ ఫామ్ కర్మాగారంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సు కు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు హాజరు కావాల్సి ఉంది. ఈ విషయాన్ని ముందే గ్రహించిన కాంగ్రెస్ నాయకులు అడ్డుకునేందుకు నర్మెట గ్రామానికి చేరుకున్నారు. అధికార కార్యక్రమానికి ఆయిల్ ఫెడ్ చైర్మన్, జిల్లా ఇంచార్జి మంత్రి, జిల్లా మంత్రికి సమాచారాన్ని ఇచ్చారా అంటూ అధికారులను ప్రశ్నించారు. నంగునూరు మండలానికి చెందిన పూర్తి స్థాయి కాంగ్రెస్ నాయకులు నర్మెటకు చేరుకున్నారు. సదస్సు పేరిట బీఆర్ఎస్ నాయకులను కలిసేందుకు హరీశ్ రావు హాజరవుతున్నారంటూ గో బ్యాక్ హరీశ్ రావు అంటూ ప్లే కార్డులు చేతబట్టుకొని నినాదాలు చేశారు. అక్కడికి చేరుకున్న బీఆర్ఎస్ నాయకులు మూకుమ్మడిగా హరీశ్ రావుకు అడ్డు వస్తే అడ్డంగా నరికి వేస్తామంటూ ప్రతి నినాదాలు చేశారు. కాంగ్రెస్ గుండల్లారా ఖబడ్దార్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. వెంటనే జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తం చేసింది. సదస్సుకు హాజరయ్యే వారు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారంటూ పోలీస్ అధికారులతో వాగ్వివాదానికి దిగారు. పంట వేసిన రైతులకే అవకాశం కల్పించాలని కోరారు. ఆయిల్ ఫెడ్ అధికారుల నుంచి లీస్ట్ తెప్పించుకొని లోనికి పంపించారు. హరీశ్ రావు రావడం లేదని సంకేతాలు వచ్చాయంటూ బీఆర్ఎస్ నాయకులు గుసగుసలు వినిపించాయి. చివరకు జిల్లా కలెక్టర్ సమావేశానికి హాజరు కావడంతో ఊపిరి పీల్చుకున్నారు.

# విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీయాలి

- సిద్దిపేట జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-రాయపోల్

విద్యార్థులలో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీసి విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సిద్దిపేట జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్లంకి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం దౌల్తాబాద్ మండలం దొమ్మాట గ్రామంలో తల్లిదండ్రులు ఉపాధ్యాయులు సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను వినూత్న కార్యక్రమాల ద్వారా సృజనాత్మకతను, నైపుణ్యతను వెలికితీస్తూ ఉత్తమ ఫలితాలు సాధించడానికి దొమ్మాట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని ఆయన అన్నారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాల చైర్పర్సన్ బి.భాగ్యలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.ఏ బాసిత్ మాట్లాడుతూ పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న బాలుర మరుగుదొడ్లు, ఇతర భౌతిక వసతుల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే పాఠశాలలో ఖాళీగా ఉన్న వ్యాయామ ఉపాధ్యాయుడి పోస్టు ఖాళీగా ఉండటం వల్ల విద్యార్థుల్లో క్రమశిక్షణ లోపిస్తోందని, డీఎస్సీ 2024 నూతన ఉపాధ్యాయులల నియామకంలో భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులను వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్న జిల్లా విద్యాధికారికి అలాగే సమావేశానికి హాజరైన 40 మంది విద్యార్థుల తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

# రైతుబంధు వేయలేమన్న మంత్రి వ్యాఖ్యలపై నిరసన

- రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-గజ్వేల్

వానాకాలం రైతుభరోసా వేయడం సాధ్యం కాదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను శనివారం దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలు గడిచిపోతున్నా మ్యానిఫెస్టోలో చెప్పిన ఏ పథకాన్ని సరైన రీతిలో ఆమలు చేయడం లేదన్నారు. రైతుబంధుకు బదులుగా రైతుభరోసా తీసుకువచ్చి ప్రతీపంట కాలానికి ఎకరాకు రూ.7500 ఏడాదికి రూ.15వేలు ఇస్తామని మ్యానిఫెస్టోలో పెట్టి.. ఇవ్వకుండా మోసం చేశారన్నారు. కౌలు రైతులకు కూడా రైతుభరోసా ఇస్తామని, రైతు కూలీలకు రూ.12వేల ఆర్థిక సహాయం అందిస్తామని చెప్పి మోసం చేస్తుందన్నారు. వడ్లకి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు తీరా పంట పండాక సన్న వడ్లకే ఇస్తామని మాట మార్చారన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దిగజార్చి ఒక వైపు అప్పుల ఊబిలోకి నెట్టి మరోపక్క మూసి సుందరీకరణ పేరుతో వేల కోట్ల ప్రజాధనాన్ని లూటి చేసే ఆలోచన చేస్తున్నదన్నారు. రైతు భరోసా ఇవ్వలేని ప్రభుత్వం మూసి సుందరీకరణకు లక్షా యాభై వేల కోట్లు ఎక్కడి నుండి తెస్తుందని ప్రశ్నించారు. వెంటనే వానాకాలం రైతు భరోసా రైతుల ఖాతాల్లో జమ చేయాలని లేని పక్షంలో రైతులందరినీ ఏకం చేసి పెద్ద ఎత్తున పోరాటం నిర్వహించి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి తగిన గుణపాఠం నేర్పుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ మాదాసు శ్రీనివాస్, ప్యాక్స్ చైర్మెన్ వెంకటేష్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మెన్ జకియొద్దిన్, ఎంపీటీసీల ఫోరమ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, మాజీ జడ్పీటీసీ పంగ మల్లేశం, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు బెండె మధు, కృష్ణా గౌడ్, నాయకులు బయ్యారం శ్రీనివాస్ రెడ్డి, దయాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన జిల్లా స్థాయి ఎస్.జి.ఎఫ్ పోటీలు

నవతెలంగాణ-సిద్దిపేట



స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సిద్దిపేట జిల్లా ఆధ్వర్యంలో 68వ జిల్లా స్థాయి క్రీడా పోటీలు బాలుర ప్రభుత్వ పాఠశాలలో శనివారం ముగిసాయి. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడలు చాలా అవసర అన్నారు. భారతదేశ జనాభా ప్రపంచ దేశాల కంటే ఎక్కువగా ఉందనీ, కానీ క్రీడల్లో చాలా వెనుకబడ్డామనీ అన్నారు. దీని గురించి ఆలోచిం చాల్సిన అవసరం ఎంతగానో ఉందనీ, ప్రతి ఒక్కరు క్రీడలను ప్రోత్సహించాలనీ అన్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో గెలుపొంది జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. సిద్దిపేట జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజిం గ్ కార్యదర్శి సౌందర్య మాట్లాడుతూ గత రెండు రోజులుగా జరిగిన పోటీలకు సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. సిద్దిపేట మున్సిపాలిటీ, ప్రభుత్వ బాలుర పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలకి, వ్యాయామ ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలిపారు. దాదాపు 3000 మందికి భోజనం మరియు గెలుపొందిన వారందరికీ బహుమతులను అందించిన విఎం ఆర్ ఫౌండేషన్ చైర్మన్ వంగ మహేందర్ రెడ్డికి ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో పేటా టీఎస్ అధ్యక్షులు తోట సతీష్, అశోక్ , హరికిషన్, రామేశ్వర్ రెడ్డి, బిక్షపతి ,లక్ష్మీనారాయణ, రాంనర్సయ్య , రవికుమార్, గోవర్ధన్ రెడ్డి, నవీన్, మురళీధర్ , లలితా భవాని ,ప్రశాంత, రాధిక, రజిని తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థినులకు చట్టాలపై అవగాహన

నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్



హుస్నాబాద్‌లోని తెలంగాణ మోడల్‌స్కూల్‌లో విద్యార్థులకు మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, సైబర్ నేరాలు, గుడ్ టచ్ బాడ్ టచ్, గంజాయి ఇతర మత్తు పదార్థాలు, సీసీ కెమెరాలు, ఈవిటీజింగ్, సైబర్ నేరాలు, నూతన చట్టాలపై హుస్నాబాద్ ఏసీపీ వాసాలా సతీష్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. షీ టీమ్ దాని యొక్క ప్రాముఖ్యత నిర్వహించే విధులను ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. షీటీం మహిళల కోసం ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థి దశ చాలా కీలకమని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ప్రవర్తించి క్రమశిక్షణతో ముందుకు వెళ్లాలన్నారు. జులై 1 నుంచి అమలైన నూతన చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఎవరైనా వేధించిన రోడ్డుపై వెళ్లేటప్పుడు అవహేలనగా మాట్లాడినా, ఉద్దేశపూర్వకంగా వెంబడించినా వెంటనే డయల్ 100, లేదా సిద్దిపేట షీ టీమ్ నెంబర్ 8712667434 కాల్ చేసి సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ ఎస్సై మహేష్, స్కూల్ ప్రిన్సిపల్ విశ్వనాథం, మరియు అధ్యాపకులు, హుస్నాబాద్ షీటీమ్ బృందం సదయ్య, హెడ్ కానిస్టేబుల్, మహిళా కానిస్టేబుళ్లు స్వప్న, ప్రశాంతి, కానిస్టేబుళ్లు కృష్ణ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**నవతెలంగాణ-సిద్దిపేట:** 11 కెవి సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ సందర్భంగా పట్టణంలోని కొన్ని ప్రాంతాలలో ఆదివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని శ్రీనివాస్ నగర్, పటేల్ పుర, సుభాష్ రోడ్, సంజీవయ్య నగర్, సాజిత్ పుర, శంకర్ నగర్, హనుమాన్ నగర్, మురుషద్ గడ్డ, సాయిబాబా దేవాలయం, ఇస్లాంపూర్, గణేష్ నగర్, బాలాగౌడ్ నగర్ ప్రాంతాలలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారు, పరిశ్రమల వారు తమకు సహకరించాలని కోరారు.

# హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం

- ప్రజా సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో కొట్లాడుతాం
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాళ్లబండి శశిధర్
- గంభీర్‌పూర్ గ్రామ శాఖ మూడో మహాసభ




నవతెలంగాణ-దుబ్బాకరూరల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో విఫలమయ్యాయని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాళ్లబండి శశిధర్ అన్నారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాలతో కొట్లాడుతామని స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలంలోని గంభీర్‌పూర్ గ్రామశాఖ ఆధ్వర్యంలో సీపీఐ(ఎం) మూడో మహాసభ శనివారం నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా శశిధర్ హాజరై, పార్టీ జెండా ఆవిష్క రించారు. అనంతరం మాట్లాడుతూ.. మూడేండ్లకొకసారి ఈ శాఖ మహాసభలు నిర్వహిస్తామన్నారు. గ్రామంలో మూడేండ్లుగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై నిర్వహించిన పోరాటాలను సమీక్షించుకొని భవిష్యత్ పోరాటాలకు ప్రణాళిక రూపొందిస్తామన్నారు. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలతో పరిపాలన చేస్తూ ప్రజలపై భారాలు వేస్తూ విదేశీ,స్వదేశీ కార్పొరేట్ ధనవంతులకు దేశ సంపదను దోచిపెడుతున్నదని ఆరోపించారు. ప్రభుత్వ సంస్థలను గంప గుత్తగా ప్రయివేటు కార్పొరేట్లకు అప్పగిస్తూ దేశ ప్రజలను మోసగిస్తున్నదని విమర్శించారు. అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయకుండా ప్రజల దృష్టిని మరలచేందుకు అనేక సమస్యలను ముందుకు తీసుకొస్తున్నదన్నారు. రుణమాఫీ పేరుతో రైతాంగాన్ని మోసగించిందని విమర్శించారు. వెంటనే రైతులకు పూర్తిస్థాయి రుణమాఫీ చేయాలన్నారు. వడ్ల కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి రైతుల నుండి ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుకూలంగా కార్మిక, ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.భాస్కర్, జిల్లా కమిటీ సభ్యురాలు సింగిరెడ్డి నవీన, మండల నాయకులు ఎండి.సాదిక్, ఎండీ సాజిద్,దినేష్, అరవింద్, శివకుమార్ ,ప్రశాంత్, శ్రీనివాస్, నరేష్, అంజిరెడ్డి, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

- సీపీఎం మండల కార్యదర్శి ఆలేటి యాదగిరి



నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని అన్ని గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని సీపీఐ(ఎం) మద్దూరు మండల కార్యదర్శి ఆలేటి యాదగిరి, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మద్దూరు మండలంలోని సలాక్ పూర్, సీపీఐ(ఎం) గ్రామ శాఖ మహాసభ సందర్భంగా సీపీఐ(ఎం) ఎర్రజెండాను ఆవిష్కరించిన అనంతరం జరిగిన మహాసభలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం పోసి 15 రోజులు గడుస్తున్నా, కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో వర్షాల కారణంగా వడ్లు తడిసి ముద్దాయ్యాయన్నారు. రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా అధికారులు పట్టించుకోకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి ధాన్యం కాంట పెట్టాలని లేని పక్షంలో రైతులను ఏకం చేసి వడ్లను తీసుకొచ్చి ప్రభుత్వ ఆఫీసులలో పోస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు చొప్పరీ రవికుమార్, మండల కమిటీ సభ్యులు ఎండి షఫీ, తరిగొప్పుల మల్లయ్య, అది మల్ల చంద్రయ్య ,శవల్ల శంకర్ ,పెళ్లి మైపాల్ ,చెట్టే బీరయ్య ,దయ్యాల కనకయ్య ,రాజు తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగాన్ని భ్రష్టు పట్టించిన కాంగ్రెస్ సర్కార్

- అద్దె భవనాలకు బిల్లులు చెల్లించక తాళాలు పడుతున్న దుస్థితి
- గ్రూప్-1 అభ్యర్థుల పై పోలీసుల దాష్టీకం ఖండిస్తున్నాం
- మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్

నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

రాష్ట్రంలో విద్యావ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా భ్రష్టు పట్టించిందని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. రేవంత్‌రెడ్డి అనాలోచిత విధానాల వల్ల రాష్ట్రంలో పేద విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని విమర్శించారు. తెలంగాణలో విద్యావ్యవస్థపై రాష్ట్ర ప్రభుత్వానికి ఏ పాటి చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోవచ్చని ఎద్దేవా చేశారు. గురుకుల భవనాలకు అద్దె చెల్లించకుండా, పేద విద్యార్థులకు కనీసం అన్నం పెట్టలేని స్థితికి కాంగ్రెస్ ప్రభుత్వం దిగజారిందని మండి పడ్డారు. రాష్ట్రానికి విద్యా శాఖ మంత్రి లేదని, ముఖ్యమంత్రికి విద్యారంగంలో సమస్యలను తెలుసుకునే ఓపిక లేదన్నారు. రాష్ట్రంలో విద్యార్థులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాల్సిందిపోయి. విద్యార్థుల జీవితాలతో సీఎం రేవంత్ సర్కార్ చెలగాటమాడుతోందని మండిపడ్డారు. విద్యార్థులకు అన్యాయం చేస్తామంటే బీఆర్ఎస్ సహించదని, కాంగ్రెస్ సర్కార్ మెడలు వంచి విద్యార్థులకు న్యాయం చేసే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర రాజధానిలో అశోక్‌నగర్ ప్రాంతంలో గ్రూప్-1 పరీక్షను వాయిదా వేయాలని కోరినందుకు అభ్యర్థులపై పోలీసుల చేసిన దాష్టీకాన్ని ఖండిస్తున్నామన్నారు. గ్రూప్-1 అభ్యర్థులను హాస్టల్లోకి చొచ్చుకెళ్లి మరి అరెస్టులు చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. గ్రూప్ వన్ పరీక్షను తక్షణమే అభ్యర్థుల కోరిక మేరకు పరీక్ష షెడ్యూల్ ను సవరించాలని డిమాండ్ చేశారు. కనీసం తాగేందుకు నీళ్లు కూడా ఇవ్వకుండా అమానవీయంగా ప్రవర్తించడాన్ని ఖండించారు. విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ తో పాటు ప్రైవేటు కళాశాలల మెయింటెనెన్స్ బకాయిలను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# సన్నాలకు... దొడ్డువాడ్లకు కొనుగోలు కేంద్రాలు కేటాయింపులు

- 75 వేల క్వింటాళ్ల సన్నాళ్ల వడ్లు కొనుగోలుకు ఏర్పాట్లు
- 417 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణకు రంగం సిద్ధం

నవతెలంగాణ-సిద్దిపేట



వరిధాన్యం కొనుగోళ్లకు అధికారులు 417 కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించడానికి ఏర్పాట్లను చేస్తున్నారు. జిల్లాలో మొదటగా హుస్నాబాద్‌లో పంట చేతికి వస్తున్నందున అక్కడ కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై రైతుల నుంచి ధాన్యాన్ని సేకరిస్తున్నారు. సిద్దిపేట, గజ్వేల్ ప్రాంతాలలో పంట లేటుగా చేతికి వస్తున్నందున పంట వచ్చిన దానినిబట్టి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు సివిల్ సప్లై అధికారులు తెలిపారు. జిల్లాలో ఈ ఖరీఫ్ లో సుమారు 3.17లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి పంట సాగు కాగా, మొత్తం దిగుబడి 8,03,530 మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చా అవకాశం ఉందని, దీనిలో రైతుల అవసరాలు, ఇతరత్రా బహిరంగ కొనుగోళ్ళు పోను 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయుటకై ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందులో 3,25,000 మెట్రిక్ టన్నుల ధాన్యం దొడ్డు రకం, మిగతా 75,000 మెట్రిక్ టన్నుల ధాన్యం సన్న రకం కొనుగోలుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

### సన్నపు వడ్లు కొనుగోలు కేంద్రాలు

జిల్లాలో 66 సెంటర్ల ద్వారా సన్నపు వడ్లు కొనుగోళ్లకు అధికారులు సిద్ధమవుతున్నారు. భూంపల్లి, అక్కన్నపేట, బెజ్జంకి, తోటపల్లి, ఆకునూర్, చేర్యాల, చిన్నకోడూరు, మల్లారం, ధూల్మిట్ట, కుటిగల్, దౌల్తాబాద్, ఇందుప్రియాల్, ముబారస్పూర్, సూరంపల్లి, దొమ్మట, చీకోడ్, తిమ్మాపూర్, దుబ్బాక, అహ్మదీపూర్, ధర్మారెడ్డిపల్లి, గజ్వేల్, పిడ్చెడ్, హుస్నాబాద్, మునిగడప, జగదేవ్పూర్, పీర్లపల్లి, కోహెడ, ఐనాపూర్, కొమురవెల్లి, మర్రిముస్తయాల, కొండపాక, మర్పడగ, చిన్నకిస్తాపూర్, కుకునూర్‌పల్లి, మంగోల్, మద్దూరు, ఎర్రవెల్లి, మార్కుక్, పాములపర్తి, వరదరాజ్‌పూర్, మిర్దొడ్డి, క్షీరసాగర్, ములుగు, సింగన్నగూడ, గట్లమల్యాల, బద్దిపడగ, గుర్రాల గోంది, జక్కాపూర్, నారాయణరావుపేట, రాయపోలు, వడ్డేపల్లి, ఎన్సన్ పల్లి, మిట్టపల్లి, పొన్నాల, సిద్దిపేట, రాఘవాపూర్, తొగుట, వెంకట్రావుపేట, గుడికందుల, కాన్గల్, పెద్ద మాసాన్ పల్లి, మైలారం వర్గల్, మజీద్‌పల్లి, తునికికల్స, వేలూరు, వర్గల్ సెంటర్లను సన్నపు వడ్లు కొనుగోళ్లకు కేటాయించారు.

### 417 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

జిల్లాలో 417 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయనున్నారు. ఐకెపి ద్వారా 211, పిఎసిఎస్ ద్వారా 200, మెప్మా ద్వారా 6 సెంటర్లను ఏర్పాటు చేసి కొనుగోళ్లు చేపట్టనున్నారు. జిల్లాలో ప్రస్తుతం సేకరిస్తున్న ధాన్యానికి 19 లక్షల కొత్త గన్ని బ్యాగులు, 26 లక్షల పాత గన్ని బ్యాగులు అందుబాటులో ఉన్నాయి. మరో 55 లక్షల గన్ని బ్యాగులు అవసరం కానున్నాయని అందులో, 35 లక్షల కొత్త గన్ని బ్యాగులు, 20 లక్షలు పాత గన్ని బ్యాగులు తెప్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

### ఏ సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలి

రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు సౌకర్యాలు కల్పిస్తున్నాం. జిల్లావ్యాప్తంగా రైతులకు కొనుగోలు కేంద్రాల వద్ద ఏ సమస్య ఉన్నా జిల్లా కంట్రోల్ రూం 7995050808, 7995050809 నంబర్లన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నంబర్లకు ఫోన్ చేసి సమస్యలను తమ దృష్టికి తేవాలని సూచించారు.



ప్రవీణ్, డీఎం, సివిల్ సప్లై శాఖ

# ఎస్టీటీలో చేరలేదు.. పీఆర్టీయులోనే ఉన్నాము

**నవతెలంగాణ-మర్కుక్:** ఎస్టీటీ యూనియన్‌లోకి చేరమని సోషల్ మీడియా వేదికగా ప్రచారాన్ని ఖండిస్తున్నామని పీఆర్టీయూ జిల్లా కార్యదర్శి ఎడెల్లి బాలకిషన్ అన్నారు. శనివారం ఆయన అంగడికిష్టాపూర్ లో మాట్లాడుతూ.. తాముమాతృ సంఘమైన పీఆర్టీయూ లోనే ఉన్నమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 70 వేల సభ్యత్వంతో అతిపెద్ద సంఘంగా ఉన్న పీఆర్టీయూ తోనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఇలాంటి దుష్ప్రచారాన్ని ఆపాలని మా సోదర సంఘ మిత్రులకు మనవి చేస్తున్నట్లు ఆయన తెలిపారు.



## నోట్లో మంటలు లేపుతున్న నరేష్

**నవతెలంగాణ-నిజాంపేట :** చేతబడి, మంత్రాలు ,దెయ్యాలు మూఢనమ్మకమని విద్యార్థి దశలోనే ప్రశ్నించితత్వం అలవర్చుకోవాలని ఎస్సై శ్రీనివాస్ రెడ్డి, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు ఉప్పులేటి నరేష్ అన్నారు. జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు నిజాంపేట పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని శంకర హై స్కూల్ నందు సైన్స్- మూఢనమ్మకాల నిర్మూలన అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎస్సై శ్రీనివాస్ రెడ్డి ఉప్పులేటి నరేష్ హాజరై మాట్లాడుతూ సమాజంలోని మూఢనమ్మకాలను విద్యార్థులు వదిలిపెట్టి శాస్త్రీయ సమాజ నిర్మాణానికి నడుం బిగించాలని. దొంగ స్వాములు భూత వైద్యులు ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని ఆర్థికంగా సామాజికంగా మోసం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.మూఢనమ్మకాలు లేని శాస్త్రీయ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఉప్పులేటి నరేష్ మాంత్రికులు భూత వైద్యులు మోసం చేసే కుట్రలను సైన్స్ మ్యాజిక్ షో ద్వారా విద్యార్థులకు వాటి వెనుక దాగి ఉన్న రహస్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అజీమాన్, ఏఎస్ఐ జైపాల్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ సునీత, బన్సీలాల్ పోలీస్ సిబ్బంది అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.....

## అంగడి బజార్ హనుమాన్ వద్ద విద్యుత్ మరమ్మతులు

**నవతెలంగాణ-గజ్వేల్**



గజ్వేల్ పట్టణంలో అంగడి బజార్ హనుమాన్ దేవాలయం వద్ద విద్యుత్ మరమ్మతులు చేసినట్లు మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి తెలిపారు. శనివారం స్థానిక ట్రాన్స్కో అధికారి మారుతి తో చర్చించి పనులు చేయించినట్లు ఆయన చెప్పారు. విద్యుత్ స్తంభాలు నూతనంగా బిగించినట్లు ఆయన తెలిపారు. దేవాలయం స్ట్రీట్ లైట్లతో పాటు ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. హనుమాన్ దేవాలయ కమాన్ కూడా మరమ్మతులు కొద్ది రోజుల్లో పూర్తి చేస్తామని ఆయన చెప్పారు. విద్యుత్ మరమ్మతులు చేయాలని ఏఈ మారుతికి చెప్పడంతో వెంటనే స్పందించి పనులు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు నేతి చిన్న సంతోష్, ఆలయ కమిటీ డైరెక్టర్ గాడి పల్లి విజయ్, బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు వినయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డబల్ బెడ్ రూమ్ ఇళ్లను సందర్శించిన కేంద్ర అధికారులు

**నవతెలంగాణ-రామచంద్రాపురం**

తెల్లాపూర్ మున్సిపాల్టీ పరిధిలోని డబల్ బెడ్ రూమ్ ఇళ్లను శనివారం కేంద్ర



ప్రభుత్వ అధికారులు సందర్శించారు. మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ జాయిన్ డైరెక్టర్ కుల్దీప్ నారాయన్, సీడీఎంఏ అండ్ హౌసింగ్ ఎం.డి గౌతమ్ డబల్ బెడ్ రూమ్ ఇళ్లను సందర్శించి అక్కడ వసతుల గురించి నిర్వాసితులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెల్లపూర్ కమిషనర్ సంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా మొరం తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత



**నవతెలంగాణ-వట్‌పల్లి**

అనుమతులు లేకుండా అక్రమంగా మొరం తరలిస్తున్న ట్రాక్టర్‌ను మండల రెవెన్యూ అధికారులు శనివారం పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా తహసీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలో అక్రమంగా మొరం తరలిస్తున్నారని తహసీల్దార్ కార్యాలయానికి నమ్మదగిన సమాచారం వచ్చింది. దాంతో కార్యాలయ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి.. మొరం నింపుకున్న వెళ్తున్న ఓ ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. అనంతరం ఆ ట్రాక్టర్‌ను పోలీసులకు హ్యాండోవర్ చేశారు. కాగా పదుల సంఖ్యలో అనుమతులు లేకుండా అక్రమంగా ట్రాక్టర్లలో మొంం తరలిస్తుంటే ఒకే ఒక ట్రాక్టర్‌ను పట్టుకోవడం విడ్డూరంగా ఉన్నదని పలువురు ఆరోపిస్తున్నారు.

8

## గజ్వేల్ అభివృద్ధిని పట్టించుకోని కేసీఆర్

**నవతెలంగాణ-గజ్వేల్**



గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధిని మాజీ సీఎం, గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ పట్టించుకోవడంలేదని కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా నాయకులు అజ్గర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పది సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసి గజ్వేల్‌కి ఒరగబెట్టింది ఏమీ లేదని ఆయన విమర్శించారు. వచ్చిన ఆరు నెలల్లోనే రైతులకు రైతు రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికి దక్కిందని, ఇది కేసీఆర్ కుటుంబం జీర్ణించుకోలేకపోతుందన్నారు. గజ్వేల్‌కు ఐదు కిలోమీటర్ల దూరంలో ఐదు కోట్లతో బస్టాండ్ నిర్మించి కాంట్రాక్టర్లు బతికించినట్లు ఆయన విమర్శించారు.

## హరీష్ కూడా వెనుక నుంచి ముందుకు వచ్చారు

నవతెలంగాణ-గజ్వేల్



మాజీమంత్రి హరీష్ రావు కూడా కేసీఆర్ వెనుక ఉండి ఇప్పుడు ముందుకొచ్చారని గజ్వేల్ మండల కాంగ్రెస్ నాయకులు ఆకుల ప్రభాకర్ అన్నారు. శనివారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డిని నా వెనుక ఉన్నావని హరీష్ రావు అనడం సిగ్గుచేటన్నారు. ఎవరైనా వెనుకనుండే ముందుకొస్తారన్నారు. కార్యకర్తలను నాయకులను అణగదొక్కడం బీఆర్ఎస్ నాయకులకు తెలిసినంత ఇతరులకు తెలువదని ఆయన విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి నాయకత్వంలో నియోజకవర్గంలో 9 మండలాల్లో మండల పరిషత్, జెడ్పీటీసీలతో పాటు గజ్వేల్, తూప్రాన్ మున్సిపాలిటీ స్థానాలను కూడా కాంగ్రెస్ ఖాతాలోకి వస్తాయన్నారు.

## తపస్ జిల్లా కార్యవర్గ సభ్యునిగా తులసి రామ్



**నవతెలంగాణ-పాపన్నపేట**

తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) మెదక్ జిల్లా కార్యవర్గ సభ్యునిగా తులసి రామ్ ను నియమించినట్లు తపస్ మెదక్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిడ్డి ఎల్లం, చల్లా లక్ష్మణ్ తెలిపారు. తులసిరామ్ మండల పరిధిలోని కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ తపస్ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని, తపస్ శాఖ ఆదేశాలను పాటిస్తూ, ఉపాధ్యాయులకు, విద్యారంగానికి అవసరమైన సేవలు అందిస్తామని వారు తెలిపారు.

## గుండెపోటుతో మహిళ మృతి



**నవతెలంగాణ-చేర్యాల**

చేర్యాల మండల పరిధిలోని ఆకునూరు శివారు మాసిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఘనపురం (సుతారి) బాలస్వామి భార్య కమల (50) మృతి చెందారు. శుక్రవారం గుండెపోటుకు గురి కావడంతో హైదరాబాద్ లోని ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందారు. మృతురాలికి భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. శనివారం పలువురు రాజకీయ పార్టీల నాయకులు, ప్రముఖులు మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. సంతాపం ప్రకటించి ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## 16వ వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు

**నవతెలంగాణ-తూప్రాన్**

తూప్రాన్ పురపాలక సంఘ పరిధిలో 16వ వార్డులో మున్సిపల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ ముదిరాజ్ ఆదేశాలతో ప్రజల అభీష్టం మేరకు నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పై కప్పు పనులను తూప్రాన్ మున్సిపల్‌లోని 16వ వార్డ్ కౌన్సిలర్ కొడిప్యాక నారాయణ గుప్తా పరిశీలించి తగు సూచనలు చేశారు. అంతేకాకుండా నాణ్యత విషయంలో రాజీ పడవద్దని ఎలాంటి ఒడిదుడుకులు ఉండవద్దని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నారాయణ గుప్తా, మున్సిపల్ సిబ్బంది వార్డు ప్రజలు పాల్గొన్నారు.



## గ్రంథాలయ చైర్మన్‌కు సన్మానం

**నవతెలంగాణ-అక్కన్నపేట**



సిద్ధిపేట జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా నూతనంగా నియామకమైన కేడం లింగమూర్తిని శనివారం అక్కన్నపేట కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు శివయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగపల్లి ఐలయ్య, చిత్తారి రవీందర్, ముత్యాల సంజీవరెడ్డి, చింతల మల్లారెడ్డి ఎల్లయ్య పొడి శెట్టి వెంకటయ్య, ఎండి అక్బర్, కొమురయ్య అనిల్, తదితరులు, పాల్గొన్నారు...

# సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా తృతీయ మహాసభల దృశ్య మాలిక



## ప్రతి ఒక్కరూ భక్తి భావం కలిగి ఉండాలి

**తొగుట పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి.**


**నవతెలంగాణ- పెద్ద శంకరంపేట్:**



ప్రతి ఒక్కరూ భక్తి భావం కలిగి ఉండాలని. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని తొగుట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి అన్నారు. శనివారం పెద్ద శంకరంపేట మండల పరిధిలోని కొప్పల్ ఉమా సంగమేశ్వర ఆలయంలో మాధవానంద సరస్వతి స్వామి ఆధ్వర్యంలో మహా రుద్రాభిషేకం స్వామివారికి లక్ష పుష్పార్చన. ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి వేద బ్రాహ్మణ పండితుల మంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలు ప్రతి ఒక్కరు ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి. మానవసేవయే మాధవ సేవ అని తోటి వారికి తమ వంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో వేద బ్రాహ్మణ పండితులు.. అధిక సంఖ్యలో మహిళలు ప్రజలు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి డిసిసి ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి జిఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుర్ర%శీ% మచ్చేందర్ మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్ మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మీ రమేష్. దత్తు శంకరయ్య ఆలయ కమిటీ బాధ్యులు తదితరులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. దత్తు శంకరయ్య ఆలయ కమిటీ బాధ్యులు తదితరులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## వర్క్ బుక్స్ పంపిణీ పంపిణీ చేసిన జి. యం. ఆర్. వరలక్ష్మి ఫౌండేషన్

**నవతెలంగాణ- వెల్దుర్తి**



మాసాయిపేట మండల పరిధి పులి గుట్ట తాండ మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదివే పేద విద్యార్థుల లో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీయడానికి శనివారం జి. ఎం.ఆర్. వరలక్ష్మి ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో మాజీ గ్రామ సర్పంచ్ మోహన్ రాథోడ్ అధ్యక్షతన పిల్లల్లో అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించడానికి ప్రత్యేకంగా రూపొందించిన జ్ఞానముతో ఆనందం వర్క్ బుక్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నవీన్ కుమార్ పాఠశాల ఉపాధ్యాయ బృందానికి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నవీన్ కుమార్ మాట్లాడారు. మా పాఠశాలలో చదివే విద్యార్థులకు జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్నో సేవలందిస్తూ వెన్ను దన్నుగా ఉంటున్నారని కొనియాడారు. జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ పాఠశాల అభివృద్ధికి చేస్తున్న సహకారానికి ధన్యవాదాలు తెలుపడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుల బృందం శంకర్ విద్యార్థులు పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బీటీ రోడ్డు నిర్మాణానికి కోటి మంజూరు

**నవతెలంగాణ-నార్సింగి**



శేరిపల్లి గ్రామం నుంచి మిర్జాపల్లి రైల్వే స్టేషన్ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు పంచాయితీ రాజ్, రూరల్ డెవలప్మెంట్ (రోడ్లు) శాఖ నుంచి కోటి నిధులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగర్ల గోవర్ధన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం జంగర్ల గోవర్ధన్, చిన్న శంకరంపేట్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి పోతురాజు మనోజ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం సంతోషకరమన్నారు. రోజు వందల మంది ఈ రోడ్డు పై ప్రయాణిస్తారని, వర్షం పడి నప్పుడల్లా రోడ్డు పై గుంతలు పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారేదని, కనీసం కాలినడక కూడా సాధ్యం కాకపోయేదని అన్నారు. గత ప్రభుత్వంలో ఎన్నో సార్లు అధికారులకు, నాయకులకు రోడ్డు పరిస్థితి గురించి విన్నవించామని, ఎవ్వరూ తమ గోడును పట్టించుకోలేదని తెలిపారు. రోడ్డు విషయమై ఎమ్మెల్యే రోహిత్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని, ఆయన వెంటనే స్పందించి రోడ్డు నిర్మాణానికి కోటి రూపాయల నిధులు మంజూరు చేశారని, దానికి తామందరము రోహిత్‌కు కృతజ్ఞతలు తెలుపు తున్నామని అన్నారు. నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇంచార్జ్ మంత్రి కొండా సురేఖ, మైనంపల్లి హన్మంతరావులకు మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిన్న కృష్ణ గౌడ్, నర్సింలు గౌడ్, పూసల శ్రీనివాస్, యూత్ నాయకులు బాలకృష్ణ గౌడ్, కందరి చిన్నబాబు, మోతిలాల్, భాను ప్రసాద్, మహిళా నాయకురాళ్ళు స్వప్న, లత, వసంత, రమ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

## ధర్మ సమాజ్ పార్టీ మహా సమ్మేళనాన్ని విజయ వంతం చేయండి

**ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాసర్ల యాదగిరి.**

**నవతెలంగాణ-తొగుట**



నవంబర్ 3న జరగబోయే ధర్మ సమాజ్ పార్టీ మొదటి సమ్మేళనం కరపత్రాలను ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాసర్ల యాదగిరి ఆవిష్కరించారు. శనివారం మండల కేంద్రంలో పార్టీ మండల నాయకులతో కలిసి కరపత్రం ఆవి ష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాలు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ లకోసం ఏర్పడిన పార్టీ ధర్మ సమాజ్ పార్టీ అన్నా రు. ఈ మహా సమ్మేళనం కార్యక్రమనికి పార్టీ అభి మానులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజవంతం చేయాలనీ పిలుపునిచ్చారు. రాష్ట్రం లో, దేశంలో అణగారిన వర్గాలైన బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ ప్రజల జీవితాలు అంధకారంలోకి నెట్టి వేయబడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సేవ చేయవలసిన రాజకీయ నాయకులు తమ సేవలకే పరిమితమై ఉంటున్నారని విమర్శించారు. దేశం లో రాజకీయాలు, ప్రభుత్వాలు కొన్ని వర్గాలకోసమే పనిచేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా స్వామ్య దేశంలో ప్రజలకు స్వేచ్ఛ లేకుండా పోయిందని మడ్డిపడ్డారు. ప్రజలకు స్వేచ్ఛ రావా లంటే ప్రజలందరూ రాజకీయాల పట్ల ఎప్పటి కప్పుడు అవగాహనా కలిగి ఉండాలని సూచిం చారు.ప్రజల సంక్షేమం కేవలం ధర్మ సమాజ్ పార్టీ తోనే సాధ్యమని ప్రజలందరూ ధర్మ సమాజ్ పార్టీ విధి విధానాలను అర్థం చేసుకొని పార్టీని బలో పేతం కృషి చేయాలన్నారు. గడప గడపకు మహ నీయుల ఆలోచన తీసుకుపోవాలని హితవు పలి కారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు రాజకుమార్, రాజు, నవీన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడి చదివితే భవిష్యత్తు బాగుబుతుంది

**నవతెలంగాణ జగదేవపూర్**



జగదేవపూర్ మండల కేంద్రములో ఒకేసారి నాలుగు ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించడం జగదేవపూర్ గ్రామానికి గర్వకారణం అని బిఆరెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బుద్ధ నాగరాజు తాజా మాజీ ఎంపిటిసి కవితా శ్రీనివాస్ రెడ్డి లు శనివారం నాడు అన్నారు .ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జగదేవపూర్ గ్రామానికి చెందిన విద్యార్థులు సిరిసిల్ల శ్రీలత ,గాండ్ల రాజు, గాండ్ల రవి , కురెళ్లరాజు లకు 2024 డిఎస్సి లో ఉద్యోగాలు రావడం సంతోషం అని అన్నారు.వారిని శాలువతో ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు వీరు ఆదర్శంగా నిలిచారని తెలిపారు. శ్రీలత ను ప్రత్యేకంగా అభినందించారు. పిల్లలతో కూడా ఉండి వారిని పాఠశాలకు పంపిస్తు శ్రద్ధతో చదివి ఉద్యోగాన్ని సాధించడం గొప్ప విషయమని అన్నారు. మిగిలి విద్యార్థులు వారిని ఆదర్శంగా తీసుకొని చదవాలని తెలిపారు.ఉన్నత చదువుల కోసం విద్యార్థులకు ఏమైనా సహాయం అవసరం ఉంటే అందుకు సహకరిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో దాచారం కనకయ్య, కొంపెల్లి మహేష్, బత్తిని శ్రీనివాస్, హలీం , ప్రశాంత్ ,బచ్చలి భాస్కర్, మచ్చ బాబు, దండే భాస్కర్, బాలకృష్ణ ,అలీరాజా, ఇస్మాయిల్, బషీర్, రామయ్య, కనకయ్య, రంగాచారి, ఉగ్రి, భాను, అరుణ్, శ్రీకాంత్, మహేష్, వంశీ, సాయి, తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా ఎగవేతపై నేడు నిరసన కార్యక్రమం.

**- మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి.**

**నవతెలంగాణ-తొగుట**



ఎన్నికల్లో హామీల వర్షం కురుపించిన సీఎం రేవంత్ రెడ్డి రైతులకు నేడు మోసం చేసాడని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి ఆరో పించారు. శనివారం ఒక పత్రిక ప్రకటన ద్వారా తెలిపిన సమాచారం ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇవ్వాల్సిన వర్షాకాల రైతుభరోసా ఎగ్గొ ట్టినందుకు నిరసనగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసి డెంట్ కల్వకుంట్ల తారకరామారావు, దుబ్బాక ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా పార్టీ అధ్యక్షులు కొత్త ప్రభాకర్ రెడ్డి పిలుపు మేరకు ఆదివారం మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలి పారు. తాము అధికారం లోకి రాగానే ఎకరానికి రూ. 15 వేల రైతు భరోసా ఇస్తామని చెప్పి, నేడు వానాకాలం పంట పూర్తి అయినా ఇవ్వలేరని ఆరో పించారు. కేబినెట్ సబ్ కమిటీ నివేదిక తర్వాత యాసంగిలో ఇస్తామని మాట్లాడటం రైతులను మోసం చేయడమే అవుతుందన్నారు. రుణమాఫీ పూర్తి కాలేదు, రైతు భరోసా లేదని, రైతులను మోసం చేసిన కాంగ్రెస్ తీరుకు వ్యతి రేకిస్తూ రైతు లతో కలిసి నిరసన కార్యక్రమం చేపడుతామ న్నారు. ఈ నిరసన కార్యక్రమం కు రుణమాఫీ కాని రైతులు స్వచ్ఛందంగా తరలి వొచ్చి విజయవంతం చేయాలని కోరారు. ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## నేడు అలయ్-బలయ్

**నవతెలంగాణ-సిద్దిపేట**

పట్టణంలోని కొండ భూదేవి గార్డెన్‌లో ఈ నెల 20వ తేదిన అలయ్-బలయ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నానని ప్రజలు, నాయకులు హాజరుకావాలని, బీజేపీ సిద్దిపేట అసెంబ్లీ ఇంచార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దూది శ్రీకాంత్ రెడ్డి కోరారు. మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించే అలయ్-బలయ్‌కు పార్టీలు, కుల, మతాలకతీతంగా ప్రజలు, నాయకులు హాజరుకావాలని కోరారు.

## పని కోసం వెళ్లిన వ్యక్తి అదృశ్యం


**- భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు**

**నవతెలంగాణ-సిద్దిపేటరూరల్:**

పని నిమిత్తం సిద్దిపేటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన మాచాపూర్ గ్రామంలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం మండల పరిధిలోని మచాపూర్ గ్రామానికి చెందిన పిట్ల గణేష్ గురువారం ఉదయం సిద్దిపేటకు కూలీ పనికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్ళాడు. ఈ క్రమంలో భార్య జ్యోతి సాయంత్రం గణేష్ కు ఫోన్ చేయగా పని చేస్తున్నా వస్తాను అని చెప్పాడు. రాత్రి 9 గంటలు అయినా ఇంటికి రాకపోవడంతో ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో బంధువులకు, స్నేహితులకు ఫోన్ చేయగా ఏలాంటి ఆచూకీ లభించలేదు. భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## రైతులను మోసం చేస్తున్న రేవంత్ సర్కార్‌లి

**నవ తెలంగాణ మిరుదొడ్డి**



ఎన్నికల్లో హామీల వర్షం కురుపించిన సీఎం రేవంత్ రెడ్డి రైతులకు నేడు మోసం చేశారని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు ఇవ్వాల్సిన వర్షాకాల రైతుభరోసా ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరుకి నిరసనగా బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు పిలుపు మేరకు రేపు దుబ్బాక నియోజకవర్గం లోని అన్ని మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.తాము అధికారం లోకి రాగానే ఎకరానికి రూ. 15 వేల రైతు భరోసా ఇస్తామని చెప్పి, నేడు వానాకాలం పంట పూర్తి అయినా ఇవ్వలేరని, కేబినెట్ సబ్ కమిటీ నివేదిక తర్వాత యాసంగి లో ఇస్తామని మాట్లాడటం రైతులను మోసం చేయడమే అవుతుందన్నారు..రుణమాఫీ పూర్తి కాలేదు, రైతు భరోసా లేదని,రైతులను మోసం చేసిన కాంగ్రెస్ తీరును ఆయా మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమం లు చేపట్టి ఎండగట్టాలని పార్టీ శ్రేణులకు సూచించారు.